


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 175 | బుధవారం 01- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## సీఎం చంద్రబాబుతో జ్యుడిషియల్ అధికారుల భేటీ.



## ఫడ్నవిస్ ను కలిసిన పవన్ కళ్యాణ్..



- తూర్పు కనుమల్లో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్న పవన్
- ఏపీకి రెండు ఆడ పులులు ఇచ్చేందుకు ఫడ్నవిస్ ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడి
- ఫడ్నవిస్‌కు ధన్యవాదాలు తెలిపిన పవన్

2లో

# ఖనిజ సంపదపై చంద్రబాబు మాస్టర్ ప్లాన్

2లో



## ఆదాయం పెంపే లక్ష్యంగా కీలక ఆదేశాలు

- రాష్ట్రంలో ఖనిజ నిల్వల గుర్తింపునకు మినరల్ మ్యాపింగ్ చేయాలని సీఎం ఆదేశం
- ఖనిజాలకు రాష్ట్రంలోనే విలువ జోడింపు ద్వారా ఆదాయం పెంచడంపై ప్రత్యేక దృష్టి
- అరుదైన ఖనిజాల వెలికితీతకు క్లస్టర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచన
- టెక్నాలజీ వినియోగంతో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా పర్యవేక్షించాలని స్పష్టం

## రాష్ట్రపతి జీవితమే స్ఫూర్తి..

### ఆమె ఎదుర్కొన్న దుఃఖాన్ని మనం ఊహించలేం



- విశాఖ గిరిజన వర్సిటీ స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితమే గొప్ప స్ఫూర్తి అని వ్యాఖ్య
- సాధారణ గిరిజన గ్రామం నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని కొనియాడారు
- చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులు
- యువత రాజకీయాల్లోకి వచ్చి దేశ గతిని మార్చాలని పిలుపు

2లో

## తెలంగాణపై విషం చిమ్మిన చౌహాన్

ఎపిని పొగుడుతూ..తెలంగాణపై అక్కసు



2లో

## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

పదవీ బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్



2లో

## అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు..

# కేంద్రం హై అలర్ట్!

- అమర్‌నాథ్ యాత్రపై నిఘా సంస్థల సమాచారంతో అప్రమత్తత
- యాత్ర మార్గంలో కట్టుదిట్టమైన భద్రత
- ఏఐ కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ ఏర్పాటు
- జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న గాలింపు చర్యలు
- యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని విజ్ఞప్తి

జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

మిగతా 2లో



జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు ప్రయత్నించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి

## రెండేళ్ల కాలంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం

- ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల విలువ రూ. 11.77 లక్షల కోట్లుగా ఉందన్న భరత్
- ఈ ప్రాజెక్టుల వల్ల దాదాపు 10.32 లక్షల ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడం ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి

2లో



ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పారిశ్రామిక అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. గత రెండేళ్ల కాలంలోనే రాష్ట్రం సుమారు రూ.20 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో

## దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక



- మనం అభివృద్ధి చెందడమే కాదు.. వెనక ఉన్నవారిని ముందుకు తీసుకెళ్లాలి
- గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

2లో

## యూట్యూబ్ వీడియోలు చూసి ఇంట్లో కాన్పు చేసుకున్న మహిళ. రక్తస్రావంతో మృతి

2లో



## కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

### బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శ



కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడారు.

# పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు





పదవి ఎవరికీ శాశ్వతం కాదని, కేవలం ఇచ్చిన మాటే శాశ్వతంగా ఉంటుందని.. నాడు ఇందిరమ్మ, ఎన్టీఆర్ లాంటి మహానాయకులే ఓడిపోయారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నాకు కూడా అంతేనని, పదవి శాశ్వతంగా ఉంటుందని నేను కూడా భావించడం లేదన్నారు. అయితే ఉన్నన్ని నాళ్లు మంచి పనులు చేసి, మంచివాడనిపించుకోవడమే ముఖ్యమని అన్నారు. నేను అబద్ధాలు చెప్పను, చెప్పింది చేసి తీరుతా. ప్రజలకు నచ్చకపోయినా ఉన్నది ఉన్నట్లే చెప్తాను అని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలది, రైతులది, ఆడబిడ్డలది అని భరోసా ఇచ్చారు. కేసీఆర్ లాంటి తప్పుడు పనులు తాను ఎప్పటికీ చేయనని చెప్తూ.. ఆ పశుపతిని (కేసీఆర్‌ను) నీ ఫార్మ్‌హౌస్‌లోనే బంధించాను, ఇక బయటకు రానిచ్చే ప్రసక్తే లేదు' అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. శిల్పకళావేదిక వేదికగా జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకుల తీరును ఎండగడుతూ పదునైన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బకాసురుడిని తీసుకెళ్లి ఫార్మ్‌హౌస్‌లో కూర్చోబెట్టారని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆయన అన్నీ మీకే చేశాడని, మళ్లీ అధికారంలోకి రావాలని అంటున్నాడు. అసలు మనకేం చేశాడు? మళ్లీ ఎందుకు వస్తాడు అని సీఎం ప్రశ్నించారు. గత పదేళ్లలో అగ్రికల్చర్, హార్టికల్చర్‌లను పూర్తిగా పక్కనపెట్టేసి, రాష్ట్రంలో 'డ్రింకింగ్ కల్చర్' తీసుకువచ్చారని మండిపడ్డారు. బకాసు9రుడు చేసిన అప్పులను మేము తీరుస్తున్నామని అన్నారు. మళ్లోసారి కేసీఆర్ వస్తే భార్యాభర్తల మాటలను వినడం తప్ప చేసేదేమీ లేదన్నారు. కన్న బిడ్డ కవిత, అల్లుడు మాట్లాడుకున్న మాటలు విన్నారని ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ఘాటు విమర్శలు చేశారు.

**ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు**

**పదవి శాశ్వతం అని నేను కూడా భావించడం లేదు**

**ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం**

**రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి గాడిన పెడుతున్నాం**

**రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం**

# ఖనిజ సంపదపై చంద్రబాబు మాస్టర్ ప్లాన్..

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అపారమైన ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు సమగ్రమైన 'మినరల్ మ్యాపింగ్' చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేవలం ముడి ఖనిజాలను వెలికితీయడమే కాకుండా, వాటికి రాష్ట్రంలోనే విలువ జోడించే (వాల్యూ యాడిషన్) ప్రక్రియలను ప్రోత్సహించడం ద్వారా గరిష్ఠ ప్రయోజనం పొందాలని స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "దేశంలోని కొన్ని రాష్ట్రాలు కేవలం ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయంతోనే రెవెన్యూ మిగులు సాధిస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ ఖనిజ సంపదకు మార్కెట్ క్యాపిటలైజేషన్ ద్వారా విస్తృత అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎండీసీ ద్వారా ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. దీనిపై నిపుణులతో అధ్యయనం చేయించి, ఒక పటిష్టమైన విధానాన్ని రూపొందించాలి" అని అన్నారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా వంటి ఖనిజాలకు ఇక్కడే విలువ జోడింపు ప్రక్రియలు జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

**అరుదైన ఖనిజాలపై ప్రత్యేక దృష్టి** ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్, అణు ఇంధనం వంటి వ్యూహాత్మక రంగాల్లో కీలకంగా ఉపయోగపడే అరుదైన భూ ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్)పై సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏపీ, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో లభ్యమయ్యే ఈ ఖనిజాల కోసం ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ వంటి అత్యంత విలువైన ఖనిజాల నిల్వలను కచ్చితంగా అంచనా వేయాలన్నారు. అలాగే, రాష్ట్రంలోని జొన్నగిరి, చిత్తూరు జిల్లా చిగురుగుంట ప్రాంతాల్లో ఉన్న బంగారం నిల్వలపై మరింత లోతుగా అధ్యయనం చేసి, ఇతర బ్లాకుల్లోనూ అన్వేషణ జరపాలని గనుల శాఖకు సూచించారు. రాష్ట్రంలో మొత్తం 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్, ఇతర విలువైన ఖనిజాలను గుర్తించినట్లు అధికారులు ఈ సమావేశంలో సీఎంకు వివరించారు.

**టెక్నాలజీతో ఇసుక పర్యవేక్షణ** ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ఇసుక విధానంలో పారదర్శకతకు, అక్రమాలకు తావులేకుండా చూడటానికి టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. "ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్ల ఆదాయాన్ని వదులుకుని ఇసుకను ఉచితంగా అందిస్తోంది. ఇది దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే" అని స్పష్టం చేశారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు, శాటిలైట్ చిత్రాల ద్వారా నిరంతర నిఘా, ఇసుక రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించడం ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం సమకూరేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫడ్నవిస్ ను కలిసిన పవన్ కల్యాణ్..

ప్రస్తుతం ముంబైలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో సమావేశమయ్యారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా తూర్పు కనుమల్లో పులుల సంరక్షణతో పాటు ఇరు రాష్ట్రాల పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడం వల్ల సంతానోత్పత్తి వంటి జన్యుపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ సమస్యను అధిగమించి, పులుల సంఖ్యను పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఏపీకి రెండు ఆడ పులులను ఇచ్చేందుకు అంగీకరించిందని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దమనసుతో సహకారం అందిస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌కు పవన్ కల్యాణ్ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం వల్ల తూర్పు కనుమల్లో జన్యు వైవిధ్యం పెరిగి, దీర్ఘకాలిక స్థిరత్వంతో కూడిన ఆరోగ్యకరమైన, స్వయం సమృద్ధి గల పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుందని పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వన్యప్రాణి సంరక్షణలో తమకు నిరంతరం మార్గదర్శకత్వం వహిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు కూడా ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శాస్త్రీయ విధానాలతో జీవ వైవిధ్య పరిరక్షణకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి ఉన్నాయని, భవిష్యత్తులోనూ కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు సాగుతామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## రాష్ట్రపతి జీవితమే స్ఫూర్తి.. ఆమె ఎదుర్కొన్న దుఃఖాన్ని మనం ఊహించలేం:

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం దేశంలోని ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా గిరిజన యువతకు గొప్ప స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్య అనేది కేవలం డిగ్రీలు ప్రదానం చేసే ప్రక్రియ కాదని, అది తరాల భవిష్యత్తును నిర్దేశించే శక్తి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవిత ప్రస్థానాన్ని విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా వివరిస్తూ భావోద్వేగ ప్రసంగం చేశారు. "ఈ విశ్వవిద్యాలయం ఎందుకు ముఖ్యమో చెప్పడానికి మన ప్రియతమ రాష్ట్రపతి జీవితం కంటే గొప్ప ఉదాహరణ లేదు. ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లా ఉపర్‌బేడా అనే చిన్న గిరిజన గ్రామంలో పుట్టిన ఆమె, పాఠశాలకు వెళ్లడమే కష్టమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ రోజుల్లో గిరిజన బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం చాలా అరుదు. అయినప్పటికీ, తన గ్రామం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మొదటి మహిళగా ఆమె నిలిచారు. ఆ ఒక్క అడుగు ఆమె భవిష్యత్తునే కాకుండా, తర్వాతి తరం అమ్మాయిల ఆకాంక్షలను కూడా మార్చేసింది" అని లోకేశ్ వివరించారు. రాజకీయాల్లోకి రాకముందు ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేశారని, జీవితాలను తీర్చిదిద్దడంలోనే తనకు అత్యంత సంతృప్తి లభించిందని ఆమె తరచూ చెబుతారని గుర్తుచేశారు. "ఆమె ప్రజా జీవితం ఎప్పుడూ ప్రత్యేకాధికారాలతో నిర్మితం కాలేదు. కౌన్సిలర్‌గా మొదలై, వైస్ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే, మంత్రి, గవర్నర్, చివరకు భారత రాష్ట్రపతి స్థాయికి అంచెలంచెలుగా ఎదిగారు. ప్రతి మైలురాయిని సంవత్సరాల ప్రజా సేవ ద్వారానే ఆమె సాధించారు" అని లోకేశ్ కొనియాడారు. ఆమె జీవితంలో ఎదుర్కొన్న వ్యక్తిగత విషాదాలను కూడా లోకేశ్ ప్రస్తావించారు. "2009 నుంచి 2014 మధ్య కాలంలో ఇద్దరు కుమారులు, భర్త, తల్లి, సోదరుడిని కోల్పోయారు. అటువంటి దుఃఖాన్ని మనలో చాలా మంది ఊహించలేరు. అయినా ఆమె నిరాశకు లొంగిపోలేదు. ఆధ్యాత్మికతలో లీనమై, ప్రజా సేవలోకి తిరిగి వచ్చి, తన వ్యక్తిగత బాధను ఇతరుల పట్ల కరుణగా మార్చుకున్నారు. పేదలు కలలు కనడమే కాదు, వాటిని నెరవేర్చుకోగలరనడానికి నా ఎన్నికలే నిదర్శనం అని ఆమె రాష్ట్రపతిగా ప్రమాణం చేసినప్పుడు చెప్పారు. ఆ మాటలు కేవలం ఉత్సవ ప్రసంగం కాదు, అది అడ్డంకులను ఎదుర్కొని జీవించిన జీవిత సారం," అని లోకేశ్ ఉద్వేగంగా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని లోకేశ్ తెలిపారు. "ప్రతి విద్యార్థికి ఉపాధి, ప్రతి విశ్వవిద్యాలయం వినూత్నంగా, ప్రతి పరిశోధకుడు శక్తిమంతుడిగా ఉండాలన్నదే మా లక్ష్యం. ప్రపంచంలో అత్యుత్తమ ప్రతిభతో పోటీపడే ఆత్మవిశ్వాసాన్ని ప్రతి యువకుడిలో నింపాలనుకుంటున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులకు సందేశమిస్తూ, "విజయాన్ని మీరు పొందే పదవితో కాకుండా, మీరు సృష్టించే మార్పుతో, మీరు తాకిన జీవితాలతో కొలవండి. డిగ్రీ మీకు వృత్తిని ఇవ్వొచ్చు, కానీ శీలం గౌరవాన్ని, సేవ వారసత్వాన్ని ఇస్తాయి. మీలో కొందరు రాజకీయాల్లోకి వచ్చి దేశ రాజకీయ గమనాన్ని మార్చాలని నేను ఆకాంక్షిస్తున్నాను" అని లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మ మాట్లాడుతూ.. 'నేను కూడా ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్‌ను. ఈరోజు ఇంతమంది యువతీయువకులకు పట్టాలు అందించడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోందని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను మరవకూడదని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. 'మీరు జీవితంలో ముందుకు వెళ్లడమే కాదు.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు కనిపిస్తారు. వారిని ప్రోత్సహించడంలో మీ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా యువత పాత్ర ఎంతో కీలకమని, దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్మ ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం అవుతుందన్నారు. స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్మ అని కొనియాడారు. విద్యార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా13 మందికి రాష్ట్రపతి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి సంధ్యారాణి, ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, వీసీ పాల్గొన్నారు.

## రెండేళ్ల కాలంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం:

విజయవంతమైందని, ఇందులో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (రాఘాదీ) ఆమోదించిన ప్రాజెక్టుల విలువ రూ.11.77 లక్షల కోట్లుగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో దాదాపు 10.32 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం పెట్టుబడుల్లో ఏపీ వాటా 24.3 శాతానికి చేరుకుందని, పారిశ్రామిక అనుమతులను వేగంగా ఇస్తూ రాష్ట్రం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మంత్రి వివరించారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చేలా క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, స్పేస్ అండ్ డ్రోన్ సిటీ, స్టీల్ ప్లాంట్లు వంటి అత్యాధునిక రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం 'ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త' అనే వినూత్న విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతలోని సరికొత్త ఆలోచనలను, ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శ్రీహరికోటను కేంద్రంగా చేసుకుని స్పేస్ సిటీతో పాటు స్పేస్ టూరిజాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా రూ.500 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 'భవ్య' పార్కుల్లో కనీసం 3 నుంచి 4 పార్కులను ఏపీకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని... ఎయిర్‌స్పేస్, డిఫెన్స్ రంగాల్లో రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు పలు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని వెల్లడించారు.

## యూట్యూబ్ వీడియోలు చూసి ఇంట్లో కాన్పు చేసుకున్న మహిళ..

**తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో విషాదం**

**తొలి కాన్పు సమయంలో సిజేరియన్ అయిన వైనం**

**రెండో కాన్పును ఇంట్లోనే ప్రయత్నించిన 32 ఏళ్ల మహిళ**

తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఒక హృదయవిదారక ఘటన వెలుగుచూసింది. కేవలం యూట్యూబ్ వీడియోల సమాచారాన్ని నమ్మి, ఇంట్లోనే ప్రసవం చేసుకోవడానికి ప్రయత్నించిన 32 ఏళ్ల శశికళ అనే మహిళ తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయింది. శశికళకు ఇది రెండో ప్రసవం. మొదటి కాన్పు సమయంలో ఆమెకు సిజేరియన్ అయింది. దాంతో అల్లోపతి వైద్యంపై ఒక రకమైన విరక్తి పెంచుకున్న ఆమె, ఈసారి ఎలాగైనా సహజ పద్ధతిలోనే ప్రసవం కావాలని గట్టిగా అనుకుంది. మళ్లీ సిజేరియన్ అవుతుందేమోనన్న భయంతో, ఈ కుటుంబం రెగ్యులర్ వైద్య పరీక్షలను, ప్రభుత్వ ఆరోగ్య కార్యకర్తల సూచనలను పూర్తిగా పక్కన పెట్టేసింది. యూట్యూబ్‌లో వచ్చే వీడియోలను చూసి ఇంట్లోనే కాన్పు చేసుకోవాలని నిర్ణయించుకుంది. చివరకు అనుకున్నట్టుగానే శశికళ ఇంట్లోనే ఒక ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిచ్చింది. కానీ, ఆ తర్వాతే అసలు సమస్య మొదలైంది. కాన్పు పూర్తయ్యాక ప్లజెంటా (మాయ)కు సంబంధించిన తీవ్రమైన సమస్యలు తలెత్తడం, విపరీతంగా రక్తస్రావం అవ్వడంతో ఆమె పరిస్థితి విషమించింది. కంగారుపడిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను పెరుందురైలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ... అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో వైద్యులు ఆమెను కాపాడలేకపోయారు. ప్రస్తుతం ఆ నవజాత శిశువు సురక్షితంగానే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల నుండి ఎలాంటి ఫిర్యాదు అందకపోయినప్పటికీ, పోలీసులు సుమోటోగా స్పందించి శశికళ భర్త కొలంతైసామిపై కేసు నమోదు చేశారు. సరియైన అవగాహన లేని ఆన్‌లైన్ ఆరోగ్య చిట్కాలు, సలహాలు నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ప్రసవ సమయాల్లో కచ్చితంగా నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ అవసరమని ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు.. కేంద్రం హై అలర్ట్!

సృష్టించే ప్రయత్నాలు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిఘా సంస్థలు గుర్తించిన సమాచారం ప్రకారం.. జమ్ముకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మొద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నారు.

## ఎల్లుండి తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కీలక సమావేశం జరగబోతోంది. సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ హాల్‌లో జరిగే ఈ 34వ మంత్రిమండలి భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈరోజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశం ఖరారు కావడంతో సచివాలయంలో పరిపాలనా పరమైన హడావుడి మొదలైంది. ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ఈ ప్రతిపాదనలను తెలుగు అనువాదంతో సహా రేపు మధ్యాహ్నం ఒంటి గంటకల్లా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు పంపాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

## కాంగ్రెస్ దిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

మోదీ నేతృత్వంలో భాజపా వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. భాజపాను గెలిపించిన రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పశ్చిమబెంగాల్‌లో ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. భాజపా కార్యకర్తల కష్టాలతో పశ్చిమబెంగాల్‌లో గెలిచామని చెప్పాను. అక్కడ పార్టీ కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. అయినా, లెక్కచేయకుండా భాజపాని గెలిపించాలనే ఆలోచనతో వారు పనిచేశారు. సర్‌పై ప్రజలకు భాజపా కార్యకర్తలు అవగాహన కల్పించాలి. తెలంగాణలో సర్‌పై ప్రజలు సంతోషంగా ఉన్నారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారు. ఇక్కడి నుంచి దిల్లీకి డబ్బులు వెళ్తున్నాయి. దిల్లీ దర్బార్‌కు తెలంగాణ ఏటీఎంగా మార్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చింది.. కానీ, ఒక్కటికూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్‌ఎస్ కలిసే ఉన్నాయి. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని నితిన్ నబీన్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు

30 నెలల్లో రైతు సంక్షేమం కోసం అనేక పనులు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 19 మంది ముఖ్యమంత్రులు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లు అప్పు చేశారని, 2014 నాడు రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రానికి రూ.69 వేల కోట్లే అప్పు ఉందని సీఎం గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పు అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేవలం కల్వకుంట్ల కుటుంబం ఏడు లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందని సీఎం చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన టైంలో మిగులు బడ్జెట్ ఉండేదని, రాష్ట్రం కోలుకోకుండా కేసీఆర్ అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. అప్పులు కాదు.. అందిన కాడ చేబదులు కేసీఆర్ తీసుకొచ్చారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ఉద్యోగులకు జీతాలు వాయిదాల్లో ఇచ్చారని బీఆర్‌ఎస్ పాలనను సీఎం రేవంత్ దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రంలో జీతాలు ఇవ్వలేని స్థితికి కేసీఆర్ తీసుకెళ్లారని సీఎం రేవంత్ విమర్శించారు. కాంట్రాక్టర్లు, సర్పంచులకు బకాయిలను కేసీఆర్ ఇవ్వలేదని, కేసీఆర్ సర్కార్ వల్లే మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని సీఎం ఆరోపించారు. బకాయిలు బకాసురుడు పెడితే.. కట్టే పాపం తనపై పడిందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. స్కూల్లోని పిల్లలకు మిడ్ డే మీల్స్ పెట్టేవాళ్లకు బకాయిలు పెట్టారని.. బీఆర్‌ఎస్ సర్కార్ అప్పులే కాదు.. తప్పులు కూడా చేసిందని సీఎం విమర్శించారు. దేశంలో ఎక్కడికి పోయినా ఇజ్జత్ పోయేలా కేసీఆర్ చేశారని, చంద్రశేఖర్ దెబ్బకు రాష్ట్రంలోని ప్రజలంతా బికారులయ్యామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తవ్వుతున్న కొద్దీ.. గుట్టల కొద్దీ అప్పులు బయటపడ్డాయని.. బీఆర్‌ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇదే వేదికపై నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై కూడా రేవంత్ రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోదీ, ఆ ఉద్యోగాలు ఎవరికిచ్చారని నిలదీశారు. ఇక్కడ ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయని, వారు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. 'అక్కడ పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కాబట్టి మీ పప్పులు ఉడికాయి. బెంగాల్‌లో గెలవడానికి మీకు 15 ఏళ్లు పట్టింది. కానీ ఇక్కడికి మీరా వచ్చేది? ఇక్కడ మావాళ్లు ఉన్నారు, దంచి కొడతారు' అంటూ తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. 'దిగిపోవడానికి ఇది నీ అయ్యా జాగీరా? మేము మీకేం బానిసలం కాదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు రైతులను వరి వేసుకుంటే ఉరే అన్న కేసీఆర్, ఆయన మాత్రం ఫార్మ్‌హౌస్‌లో వడ్లు పండించి ఏకంగా 4200 క్వింటాళ్లు అమ్ముకున్నాడని ఆరోపించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలినా.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బోరు కింద పంటలు పండినా కాళేశ్వరం మహిమ అంటూ ప్రజలను మోసం చేశారని చెప్పారు. కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా? దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు? పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి తాగుడు కల్చర్ నేర్పించారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే చేసేదేమీ ఉండదు. వరి వేస్తే ఉరే అని బెదిరించి రైతుల పంటను కొనలేదు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ అన్నారు.. వేశారా?ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఆయన చెప్పారు.. ఇచ్చారా? అని ప్రశ్నించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం. మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. మహిళలతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి యజమానులుగా చేశాం. రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అన్నారు.

## తెలంగాణపై విషం చిమ్మిన చౌహాన్

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓ రకంగా విషం కక్కారు. ఇటీవల కేంద్ర మంత్రులు అడపాదడపా విషం కక్కుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి మన రాష్ట్రానికే చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు పెద్దగా పట్టింపు లేదు. ఏదైనా పని కావాలని పట్టుబట్టి చేయించడం లేదు. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రుల సమావేశంలో శివరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. అంతేగాకుండా ఆంధ్రా మాత్రాం భేషుగ్గా పనిచేస్తోందని స్తుతించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో మోడీ సర్కార్ నడుస్తోంది. అందుకే ఈ మధ్య బాబును పొగడడం కేంద్రమంత్రులు బాగా అలవాటు చేసుకున్నారు. పనులు గట్టెక్కించుకునే క్రమంలో చంద్రబాబు కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. కానీ మధ్యలో తెలంగాణలో తెగడాల్సిన పనిలేదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. పనిలో పనిగా గ్రామీణాభి వృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్‌ఎంఏజీఐ నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్‌ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు. ఇదంతా కేవలం కావాలని చేస్తున్న ప్రకటనగానే చూడాలి. తెలంగాణపై విషం కక్కేందుకు ఎలాంటి అవకాశాన్ని కూడా కేంద్రం వదులుకోవడం లేదు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది పక్కన పెడితే కనీసం అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోతే అది ప్రజలకే నష్టం అన్న జ్ఞానం ఇక్కడ ఉన్న ఇద్దరు మంత్రులకు కలగడం లేదు. బాబును పొగడడం కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఇదే నిదర్శనం.

## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్టర్న్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ఎ÷–లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

# క్షేత్రస్థాయిలో 'ఎస్ఐఆర్' వేగం పెంచాలి

**అత్యల్ప బూత్‌లపై ప్రత్యేక శ్రద్ధ వహించారు**

**ఏఈఆర్వోలు, అదనపు ఏఈఆర్వోలు, సూపర్వైజర్‌లకు ఆదేశం**

**కర్నూలు ఏ ఈ ఆర్వో, కమీషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూలు సిటీ నందిపత్రిక** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో మరింత వేగవంతం చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. మంగళవారం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏఈఆర్వోలు, అదనపు ఏఈఆర్వోలు, సూపర్వైజర్లు, బీఎల్‌వోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం 177వ పోలింగ్ బూత్ పరిధిలో ఈసియం కాంపౌండ్ నందు జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా ఎస్ఐఆర్‌లో అత్యల్ప శాతం ఉన్న బిఎల్వోలకు ఈఆర్వో నేరుగా కాల్ చేసి, వాటికి కారణాలు తెలుసుకుని మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో పురోగతి అత్యల్పంగా ఉన్న బూత్‌లను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి బూత్‌లో అర్హులైన ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందేలా చర్యలు చేపట్టాలని, ప్రక్రియలో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా పనిచేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి తప్పనిసరిగా కలవాలని, వారి సందేహాలను నివృత్తి చేస్తూ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, సూపర్వైజర్లు రోజువారీ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రతి ఓటర్ రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా, 2002 సంవత్సరంలో ఓటరు నమోదుకు సంబంధించిన వివరాలు ఉంటే వాటిని సిద్ధంగా ఉంచుకోవాలని, లేకపోతే తల్లిదండ్రులు లేదా అవ్వ, తాత, నాన్నమ్మ, జేజినాన్నలలో ఎవరిదైనా ఓటు ఏ రాష్ట్రం, నియోజకవర్గం, పార్ట్ నంబర్, సీరియల్ నంబర్‌లో నమోదై ఉందో ఆ వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఆర్వోలు అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ మద్దులేటి స్వామి దేవస్థానం నందు తల నీలాల వేలం పాట 2 కోట్ల 3 లక్షల 94 వేలు.

**దక్కించుకున్న సంజయ్ ఎంటర్ ప్రైజర్స్-- మైదుకురు-- కడప జిల్లా.**





**బేతంచెర్ల జూన్ 30 ( నందిపత్రిక ).** దేవాదాయ శాఖ, శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం హక్కు భుక్తమైన కళ్యాణ కట్ట యందు, భక్తులు సమర్పించిన తల నీలాలు ప్రోగు చేసుకొనుటకు, ఒక సంవత్సర కాలం అనగా 01/7/2026 నుండి 30/6/2027 వరకు లైసన్సు మంజూరు నిమిత్తం, సోమవారం దేవస్థానం ప్రాంగణంలో బహిరంగ వేలము,ఈ - టెండర్, షీల్డ్ టెండరు ద్వారావేలం నిర్వహించగా, టెండర్ల కంటే బహిరంగ వేలము ద్వారా అత్యధికంగా 2 కోట్ల 3 లక్షల 94 వేల రూపాయలుకు వేలం పాట పాడిన,సంజయ్ ఎంటర్ ప్రైజర్స్- మైదుకూరు ( కడప జిల్లా )వారు, తలనీలాలు ప్రోగు చేసుకొనే హక్కు పొందారు.గడిచి పోయిన గత సంవత్సరములో,ఒక సంవత్సరం తల నీలాల పాటకు గాను,1 కోటి 85 లక్షల 40 వేలు రూపాయలు వేలం కాగా,ఇప్పుడు పాడిన పాట 2 కోట్ల 3 లక్షల 94 వేలు రూపాయలు.గడిచిన సంవత్సర పాట కంటే, ప్రస్తుత పాట 18 లక్షల 54 వేలు రూపాయలు అధికంగా కొత్త వేలం పాట ద్వారా సమకూరాయని ఉపకమీషనర్ & శ్రీ మద్దులేటి స్వామి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు తెలిపారు.

## విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన పోలీసు అధికారులకు ఘన సన్మానం

**పదవి విరమణ పొందిన 13 మంది పోలీసు అధికారులను శాలువా, జ్ఞాపికతో సత్కరించిన కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా**



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం నిజాయితీతో, అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో మంగళవారం కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా , ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ లు ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన 13 మంది పోలీసు అధికారులను శాలువా పూలమాలతో సన్మానించి , జ్ఞాపికను అందజేసి వారి సేవలను కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

**అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్పీరామాట్లాడుతూ** పోలీసు శాఖతో తమ అనుబంధం ఎల్లప్పుడూ కొనసాగుతుందని, పదవీ విరమణ తర్వాత కూడా ఏవైనా సమస్యలు ఎదురైతే ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ని సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు.

**పదవీ విరమణ పొందిన అధికారులు/సిబ్బంది వివరాలు:**

1)ఎస్ఐ రమణరావు పీసీఆర్, కర్నూలు
2)ఎస్ఐ ఎర్రన్న ఎమ్మిగనూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్.
3)ఎస్ఐ ఖాదర్ వలి – పీసీఆర్, కర్నూలు.
4)ఎస్ఐ అంజినప్ప కర్నూలు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ .
5) ఎస్ఐ కె. గోపాల్ పీసీఆర్, ఆదోని.
6) ఎస్ఐ కరీం బాషా కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్.
7) ఏఎస్ఐ సోమశేఖర్ కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్.
8) ఏఎస్ఐ యు . ఎం. శ్రీనివాసులు ఎమ్మిగనూరు టౌన్ పోలీస్ స్టేషన్.
9) ఏఎస్ఐ ఎం. శ్రీనివాసులు ఓర్వకల్లు పోలీస్ స్టేషన్
10) డబ్ల్యూఏఎస్ఐ దేవకృపమ్మ కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్.
11) ఏఎస్ఐ జి. శ్రీనివాసులు ఎమ్మిగనూరు రూరల్ పోలీస్ స్టేషన్.
12) ఏఆర్ఎస్ఐ యేసురత్నం డీఏఆర్, కర్నూలు
13) హెడ్ కానిస్టేబుల్ హనుమంతు ఆదోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్.

ఈ కార్యక్రమంలో ఎ ఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ , హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, ఆర్ ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, ఎస్సైలు , ఎఎస్సై మరియు పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కడమలకాల్వ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే బుడ్డా



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 30:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాల్వ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే బు డ్డా రాజశేఖర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఎస్సీ కాలనీలో స్మశాన వాటికకు సంబంధించి రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించమని స్థానిక తెలుగుదేశం నాయకుడు ఎద్దుల సుబ్బారాయుడు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ మేరకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆర్సీఎం చర్చి నుండి స్మశాన వాటిక వరకు రోడ్డు నిర్మించేందుకుగాను 10 లక్షల రూపాయల నిధులు ఈ ఏడాది జనవరి నెలలో మంజూరు చేయించారు. ఈ నిధులకు సంబంధించి పూర్తయిన సిమెంట్ రోడ్డు ను ఎమ్మెల్యే పరిశీలించారు. స్మశాన వాటికకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి సుబ్బరాయుడు, వెంకటయ్య, పబ్బతి రాజేష్ ఎస్సీల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. స్మశాన వాటికకు సంబంధించి కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు కూడా నిధులను మంజూరు చేయాలని సుబ్బరాయుడు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయంలో ఆలోచించి త్వరలో కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే చెప్పారని సుబ్బారాయుడు వివరించారు.

## ప్రవేశ ద్వారాలు నగర స్వచ్ఛతకు అద్దం పట్టాలి

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలోకి ప్రవేశించే వారికి నగర స్వచ్ఛత, అందం తొలి చూపులోనే కనిపించేలా నగర ప్రవేశ ద్వారాలు పరిశుభ్రతకు అద్దం పట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. మంగళవారం నగర పరిధిలోని ఎన్‌హెచ్-44 జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. న్యూ కృష్ణనగర్, రామచంద్రనగర్, గుత్తి పెట్రోల్ బంక్, షరీన్‌నగర్ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛత పనులను కమిషనర్ స్వయంగా పర్యవేక్షించి చేపట్టించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోకి వచ్చే వారికి తొలి అభిప్రాయం కలిగించే ప్రాంతాలు ప్రవేశ ద్వారాలేనని, వాటి పరిశుభ్రత, సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా వాహనం, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ప్రధాన రహదారులు, సర్వీస్ రోడ్ల వెంట చెత్త, మురుగు నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, రోడ్ల పక్కన పెరిగిన కలుపు మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పేర్కొన్నారు.అనంతరం కమిషనర్ కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శివశంకర్, ఎ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రామాలయ నిర్మాణానికి శిల్పా రియల్ ఎస్టేట్ యజమాని గుండ్రెడ్డి రాఘవరెడ్డి రూ.25 వేల విరాళం



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణంలోని న్యూ అమరావతి నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రామాలయ నిర్మాణానికి శిల్పా రియల్ ఎస్టేట్ యజమాని శ్రీ గుండ్రెడ్డి రాఘవరెడ్డి రూ.25,000 నగదు విరాళం అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదన శర్మ గారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల రాఘవరెడ్డి గారికి ఉన్న అభిమానం, సమాజ సేవ పట్ల ఉన్న నిబద్ధతకు ఈ విరాళం నిదర్శనమని కాలనీవాసులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొనియాడారు.ఆలయ నిర్మాణానికి ఆయన అందించిన ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీ గుండ్రెడ్డి రాఘవరెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ,ఆయనకు శ్రీరాముని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.

## ఉపాధ్యాయ జీవితం ఆదర్శప్రాయమైనది. ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు సిటీ నందిపత్రిక** ఉపాధ్యాయ జీవితం ఆదర్శప్రాయమైనదని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, సోషల్ టీచర్ సుశీలమ్మ ల పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమన్నారు... తాను 4 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా పని చేశానన్నఎంపీ.ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఉండే బంధం ఎనలేనిదన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు కృష్ణ యాదవ్, మహమ్మద్ రఫీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి స్ఫూర్తితో అంతక్రియలకు ఆర్థిక సాయం

**వైఎస్ఆర్సిపి నాయకులు కాంట్రాక్టు బసవరాజు చేతుల మీదుగా ఐదు వేలు సహాయం**

**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామం హరిజన దేవదాస్ వయసు 50 సంవత్సరాలు మంగళవారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న వైయస్సార్సీపి నాయకుడు కాంట్రాక్ట్ బసవరాజ్ హరిజన దేవదాస్ పార్థదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి వైఎస్ఆర్సిపి పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు. అనంతరం వైఎస్ఆర్సిపి నాయకుడు కాంట్రాక్ట్ బసవరాజు మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి స్ఫూర్తితో అంతక్రియలకు ఆర్థిక సాయం 5000 రూపాయలు అందజేశారు. హరిజన దేవదాసు వారి కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి, వైయస్సార్సీపి నాయకుడు కాంట్రాక్ట్ బసవరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కే రామరెడ్డి, గొరవ తిక్కయ్య, మస్తాన్, హనుమంతు, రాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## స్థానిక సమస్యల పరిష్కారం కోసం జులై 2 వ తేది మున్సిపల్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి :సిపిఎం




**ఆత్మకూరు :** పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరుగు జూలై 2వ తేదీ మున్సిపల్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం,పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ కోరారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్ ఏ. ధనుంజయ మీటింగ్ హాల్ నందు జరిగిన సమావేశం లో వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల అధ్యయనం కోసం సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు పట్టణంలోని అన్ని వార్డులలో పాదయాత్రగా పర్యటించి సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి ప్రజలను పోరాటాలకు సిద్ధం చేసేందుకు కృషి చేస్తారని అన్నారు.కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పెట్టుబడుదారులు కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని సామాన్య మధ్యతరగతి ప్రజల పైన విచ్చలు విడిగా పెట్రోలు, డీజిల్ ,వంటగ్యాస్, ఎరువులు, విద్యుత్తు, నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై భారము మోపుతూ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ట్రంప్ లొంగిపోయి భారతదేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టాడని వారు ఆరోపించారు ,ట్రంపు వీసా పేరుతో భారతీయులను సంకెళ్లు వేసి ఇండియాకు తీసుకొస్తున్నారని, ఇండియా పైన ట్రంపు విచ్చలవిడిగా పన్నులు వేస్తున్నారని వారు ఆరోపించారు, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను రద్దుచేస్తూ పెట్టుబడిదారుల కోసం నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం జరిగిందని వారు ఆరోపించారు, రైతులు పండించిన ఏ పంటకు నేటి పాలక ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించడం లేదని గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారి ఆరోపించారు, ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నారు , పాత చట్టాన్ని రద్దుచేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చారని వారు ఆరోపించారు, ప్రభుత్వ రంగాలన్నీ ప్రైవేటీకరణ చేయడం ,అమ్మి వేయడం జరుగుతుందన్నారు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్రలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు ఈ సమావేశం లో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు డి. రామ్ నాయక్,, ఏ. సురేంద్ర, వీరన్న, షైక్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు

## ప్రజాప్రతినిధుల కోర్టులో బండి సంజయ్ కి ఊరట

హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. అసలు విషయానికి వస్తే... హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హుజూరాబాద్ పోలీసులు.. బండి సంజయ్‌పై పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

# ఉల్లి సాగులో మెళకువలపై రైతులకు శిక్షణ

### - ఉద్యాన శాఖ అధికారి చందన



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలో ఎదురుపాడు గ్రామంలో ఉల్లి సాగులో మెళకువలపై రైతు శిక్షణ కార్యక్రమాన్ని ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో హార్టికల్చర్ ఆఫీసర్ చందన నిర్వహించడం జరిగింది. వ్యవసాయ మెలుకులను కర్నూల్ డాట్ సెంటర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ సుజాతమ్మ రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ లో మేలు రకాలైన అగ్రిఫౌండ్ డార్క్ రెడ్, భీమా శుభ్ర, భీమా శ్వేత, భీమారెడ్, భీమా వికాస్ మొదలగు రకాలు వేసుకోవాలన్నారు నారు పోసుకునే ముందర థైరం 3 గ్రామ్స్ కేజీ విత్తనానికి చొప్పున విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకొని, నారు 6-8 వారాల వయసు లో నాటుకోవాలన్నారు ముదిరిపోయిన నారుని నాటుకోవడం వల్ల గడ్డలు పగుళ్ల వస్తాయి. నారు మొక్కలు నాటుకునే ముందర మలథయాన్ 2గ్రా+ సి వో సి 3గ్రా చొప్పున కలిపిన ద్రావణంలో ముంచి నాటుకోవాలి. తప్పనిసరిగా ఎత్తు మడులలోనే నాటుకోవాలి, డ్రిప్ అమర్చుకొని సాగు చేసుకోవాలి. ఎకరాకు 10 టన్నులు చొప్పున ఎఫ్ ఎ ఎం, 250 కేజీ వేప పిండి వేసుకోవాలి. ఉల్లి నాటుకునే ముందర దుక్కిలో ట్రైకోడెర్మా విరిడి తప్పక వాడాలి. ఉల్లి సాగులో ప్రతి మూడు పంటలకు ఒకసారి్గ అూా4 ఏ25కేజీలు ఎకరాకి చొప్పున వేసుకోవాలి. ఈ కార్యక్రమంలో రామలింగారెడ్డి, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ విజయ్, సిప్లాన్ కంపెనీ ప్రతినిధి వినోద్, పతాంజలి కంపెనీ మేనేజర్ రమణారెడ్డి, కిషోర్, ప్రసాద్, మధు, రవి మరియు రైతులు పాల్గొన్నారు.

# ఎంపీ బాల శౌరిని కలసిన మల్లేష్





**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 30:** నంద్యాల పార్లమెంట్ సభ్యులు, మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని వంశీని బండి ఆత్మకూరు మండలం బి కోడూరు గ్రామానికి చెందిన మల్లేష్ మంగళవారం కలిశారు. నంద్యాల పార్లమెంటు పరిధిలో జనసేన పార్టీ నిర్మాణ సారాదుల సమాచారం సేకరణ, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నంద్యాలలో జరిగింది. బీ కోడూరు కు చెందిన మల్లేష్ ఎంపీ బాలశౌరీని కలిశారు. జనసేన పార్టీ అభివృద్ధి కోసం తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి వివరించారు. జనసేన పార్టీలో తనను మండల అధ్యక్ష పదవికి ఎంపిక చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. తనను మండలాధ్యక్ష పదవికి ఎంపిక చేస్తే రాబోవు రోజులలో జనసేన పార్టీ అభివృద్ధి కొరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎంపీకి వివరించారు. బి.కోడూరు గ్రామానికి చెందిన సిద్దు భాష కూడా జనసేన పార్టీ శ్రీశైలం నియోజకవర్గం కమిటీ సభ్యులు శాలుభాషను కలిశారు. జనసేన పార్టీలో తనకు కూడా అవకాశం కల్పించాలని సిద్దు బాష విజ్ఞప్తి చేశారు. గత రెండు రోజులుగా పార్లమెంటు పరిధిలో అధిష్టానం నియమించిన కమిటీ సభ్యులు పదవుల కొరకు ఆసక్తిగల జనసేన నాయకులు కార్యకర్తలు నుండి దరఖాస్తులు స్వీకరించగా, మండలం నుండి ఇరువురు జనసేన కార్యకర్తలే దరఖాస్తు చేసుకోవడం విశేషం.

# వెంగళరెడ్డిపేట,కడమల కాల్వ గ్రామాల్లో రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే బుడ్డా

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 30:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాల్వ, వెంగళ రెడ్డి పేట గ్రామాలలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కడమల కాల్వ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంటు రోడ్డు ను ప్రారంభించారు. వెంగళరెడ్డిపేట గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంటు రోడ్డు ను కూడా ప్రారంభించారు. పల్లె పండుగ టు ద్వారా సిమెంటు రోడ్ల నిర్మాణాలు గాను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి నిధులను మంజూరు చేయించారు. అంతకుముందు ఆలయాల్లో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పద్మావతమ్మ, ఎంపీడీవో గాయత్రి, ఏపీవో డాక్టర్ వసుధా రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ వెంకట్రాముడు,వెంగళ రెడ్డి పేట గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు శ్రీనివాసులు తో పాటు పలువురు తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# ట్రాక్టర్ డీ కొట్టడంతో గాయపడ్డ యువకుడు..



**చాగలమర్రి జూన్ 30 నంది పత్రిక** మండల కేంద్రమైన చాగలమర్రిలోని జాతీయ రహదారి ప్రక్కన ఉన్న హైవే బ్రిడ్జి వద్ద మంగళవారం సర్వీస్ రోడ్డు దాటుకుంటున్న మల్లె వేముల గ్రామానికి చెందిన చింతాకు చిన్న ఓబులేసు (40)ను గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీ కొట్టడంతో క్రిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. జరిగిన సంఘటన తెలుసుకున్న చల్లా నాగరాజు యాదవ్ హుటాహుటిన చిన్న ఓబులేసు ను స్థానిక కేరళ ఆసుపత్రికి తన వాహనంలో చేర్పించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం అత్యవసర వాహనంలో కడపకు తరలించినట్లు మలివేముల గ్రామానికి చెందిన టి నరసింహుడు తెలిపారు

# ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి

### - సహాయ సంచాలకులు వరప్రసాద్



**చాగలమర్రి జూన్ 30 నంది పత్రిక** ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వరప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని మద్దూరు పశువైద్య కేంద్రంలో లైవ్‌స్టాక్ అధికారి మురళికృష్ణ మంగళవారం రిటైర్డ్ అయ్యారు. ఈ సందర్భంగా చాగలమర్రి పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో సన్మాన సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మూగజీవాలకు,పాడిరైతులకు ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఆయన శేషజీవితం ప్రశాంతమైన వాతావరణంలో గడవాలని, ఆయూరారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మురళికృష్ణ దంపతులను సహచర ఉద్యోగులు,పశు సంవర్ధక శాఖ సిబ్బంది,కుటుంబీకులు,బంధుమిత్రులు పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు దీపాకుమారి,నందిని,సాయిబాబా,పుల్లయ్య,రవీంద్రారెడ్డి,పశువైద్య సిబ్బంది,ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

# పీఓకేలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తీవ్ర నిరసన... భారత్‌తో కలుస్తామని హెచ్చరిక

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. రావల్ కోట్‌లోని ఈద్గా మైదానంలో గత 22 రోజులుగా వేలాది మంది ప్రజలు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. పీఓకే పాకిస్థాన్‌లో భాగం కాదని, ఇకపై ఇస్లామాబాద్ నియంత్రణలో తాము ఉండబోమని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు.

ఈ ఆందోళనలో పాల్గొన్న పౌర హక్కుల కార్యకర్త సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పాక్ ప్రభుత్వం ఆహారం, నిత్యావసరాలను అడ్డుకుంటే, తమ సరిహద్దులను భారత్ వైపు తెరుస్తామని ఆయన అన్నారు. అప్పుడు పీఓకేను తమతోనే ఉండమని ఇస్లామాబాదే వేడుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. పాక్ ప్రభుత్వ అణచివేత, తీవ్రమైన ఆర్థిక కష్టాలు, ద్రవ్యోల్బణం, పాలనా వైఫల్యాలే ఈ నిరసనలకు ప్రధాన కారణాలని ఆందోళనకారులు తెలిపారు. సుమారు రెండు వారాలుగా ప్రభుత్వం ఆహార, సరఫరాల దిగ్బంధనం విధించడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఉచిత నోటు పుస్తకాలను పంపిణీ చేసిన ఎఫ్ సి ఎన్ సంస్థ



**కాశినాయన జూన్ 30: (నంది పత్రిక)** పోరుమామిళ్లలోని చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్. గీత, తోమాస్ రెడ్డి చిత్తా దంపతులు కాశినాయన మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెడ్డి కొట్టాల లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు 70మందికి ఉచితంగా 280నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి పి కృష్ణారెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కొంత చేయూతనివ్వాలనే సదుద్దేశంతో ఈ నోటు పుస్తకాల పంపిణీ చేపట్టామన్నారు. కావున విద్యార్థిని, విద్యార్థులు వాటిని సద్వినియోగపరుచుకోవాలన్నా రు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి ,ఖదీర్ బాష, మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల చదువు కోసం ఎఫ్ సి ఎన్ సంస్థ నోటు పుస్తకాలు పంపిణీ చేయడం గొప్ప విషయం అంటూ కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కువైట్‌లో కుటుంబాన్ని పోషిస్తూఉ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బద్వేల్ యువకుడు ప్రభుత్వ సాయం కోరుతున్న కుటుంబం





**బద్వేల్ జూన్ 30: (నంది పత్రిక)** వైఎస్సార్ కడప జిల్లా పట్టణానికి చెందిన తుమ్మిశెట్టి సురేష్ జీవిత ప్రయాణం విషాదాంతమైంది. కుటుంబానికి అండగా నిలిచిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ప్రస్తుతం ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.తుమ్మిశెట్టి సురేష్ 1996 మార్చి 25న బద్వేల్‌లోని వెంకటయ్యనగర్ వీధిలో జన్మించారు. కుటుంబంలో తల్లి, తమ్ముడు ఉండగా, 2022లో తండ్రి అనారోగ్యంతో మరణించడంతో కుటుంబ బాధ్యతలన్నీ సురేష్‌పై పడ్డాయి.విద్యాభ్యాసంలో భాగంగా సురేష్ పదో తరగతి వరకు లక్ష్మి విద్యారణ స్కూల్లో చదివి, అనంతరం బద్వేల్‌లో డిప్లొమా పూర్తి చేశారు. 2016 నుంచి 2022 వరకు శ్రీ లక్ష్మి విద్యారణ స్కూల్లో పీటీ మాస్టర్గా సేవలందిస్తూ విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చి మంచి గుర్తింపు పొందారు.ఆ తర్వాత బాక్సింగ్ రంగంలో తన ప్రతిభను కొనసాగిస్తూ జేబీఎస్ బాక్సింగ్ క్లబ్‌లో హెడ్ కోచ్‌గా పనిచేశారు. 2022-23 మధ్య బాక్సింగ్ కోచ్‌గా సేవలందించడమే కాకుండా, 2022లో లో జరిగిన జాతీయ బాక్సింగ్ పోటీల్లో క్రీడాకారుడిగా పాల్గొన్నారు.కుటుంబ పరిస్థితులు కఠినంగా మారడంతో 2023లో కువైట్‌కు వెళ్లి ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి సంపాదించిన ప్రతి రూపాయిని కుటుంబ పోషణ కోసం పంపిస్తూ తల్లి, తమ్ముడికి అండగా నిలిచారు.అయితే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సురేష్ దుర్మరణం చెందడంతో కుటుంబం తీవ్ర విషాదంలో కూరుకుపోయింది. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న వ్యక్తిని కోల్పోవడంతో ప్రస్తుతం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని స్థానికులు, కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఘనంగా పదవీ విరమణ సన్మాన మహోత్సవం





**మర్రిపాడు జూన్ 30నంది పత్రిక :** చుంచులూరు ఎస్సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొంతు రత్నయ్య పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా,అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి నాగేశ్వర వర ప్రసాద్ మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన ఆదర్శ ఉపాధ్యాయుడిగా విద్యారంగానికి రత్నయ్య చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు.మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య,ధనలక్ష్మి మాట్లాడుతూ మర్రిపాడు మండల విద్యాశాఖలో క్రమశిక్షణ,నైతిక విలువలు కలిగిన ఉత్తమ ఉపాధ్యాయుడిగా చిరస్మరణీయ సేవలు అందించారని ఘనంగా కొనియాడారు.అనంతరం మండలంలోని ఉపాధ్యాయులు,బంధుమిత్రులు,గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై సన్మాన కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చివరగా రత్నయ్య తన చిన్ననాటి గురువు కలిశెట్టి వెంకటరమణయ్యను ఘనంగా సత్కరించి,వారి ఆశీర్వాదాలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి జొన్నా సత్యనారాయణ,కదిరి నాయుడుపల్లి క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర,చుంచులూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్,టి.యన్.పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్,పోలిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్తాన్,చిలకపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారుతి కేశవరెడ్డి,కంపసముద్రం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి,నందవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్,బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు,చుంచులూరు మాజీ సర్పంచ్ యలగాల వెంకటేశ్వర్లు,జిల్లా రైతు సంఘం నాయకులు మూలివెంగయ్య,శ్రీ ఇంద్రాక్షి దేవస్థాన ట్రస్ట్ సభ్యులు ఇరుకుమాటి మురళీధర్,ఎస్ఎంసి చైర్మన్ ప్రసాద్,కదిరినాయుడు పల్లి క్లస్టర్ సెక్రటరీ విజయభాస్కర్ రెడ్డి,రాజేంద్ర కుమార్,వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు ,తల్లిదండ్రులు విద్యార్థులు,గ్రామస్తులు,బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాద్రి వల్లి ఉరుసు మహోత్సవం..

### ఉరుసులో పాల్గొన్న గంగుల ఇందిరమ్మ

**చాగలమర్రి జూన్ 30 నంది పత్రిక** మండల కేంద్రమైన చాగలమర్రిలోని హజరత్ సాహే మహమ్మద్ గౌస్ పీర్ల ఖాద్రి వల్లి ఉరుసు మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉరుసు మహోత్సవానికి మాజీ ఎమ్మెల్సీ, కర్నూలు పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి సతీమణి గంగుల ఇందిరమ్మ హాజరయ్యారు. ఉరుసు కార్యక్రమంలో ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర నాయకుడు షేక్ బాబూలాల్, ప్రముఖ పారిశ్రామికవేత్త,చక్రం బీడీ అధినేత ముళ్ళ షబ్బీర్ అహ్మద్, వైసీపీ నాయకుడు గేట్ల మాబు, కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఎత్తిపోతలపై రైతుల సమావేశం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 30** : బండి ఆత్మకూరు ఎత్తిపోతల పథకం నిర్వహణపై ఆయకట్టు రైతులు మంగళవారం ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఎత్తిపోతల పథకం వద్ద వేదికగా చేసుకొని రైతులు సమావేశాన్ని నిర్వహించారు. గత కొద్దికాలం నుండి ఎత్తిపోతల పథకానికి సంబంధించి కమిటీని ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతూ ఉంది. గతంలో కొంతమందిని పథకం నిర్వహణకు అధికార పార్టీ యంత్రాంగం నియమించినప్పటికీ వారు ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఆయకట్టు పరిధిలో లేకపోవడంతో వారు అనర్హు లంటూ రైతులు వాదిస్తున్నారు. ఈ కారణంగా ఎత్తిపోతల పథకానికి నియమించిన వ్యక్తులకు అర్హత లేదంటూ రైతులు వాదిస్తున్నారు. ఇదే విషయంపై రైతులు సమావేశాన్ని నిర్వహించగా ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఓ క్రింది స్థాయి అధికారి సమావేశంలో పాలుపంచుకున్నారు. ఎత్తిపోతల పథకం కింద 200 ఎకరాలు ఆయకట్టు భూములు ఉండగా, ఇప్పటికే చాలామంది రైతులు 30 ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారు. వారం రోజుల క్రితం డ్రై షోయింగ్ విధానంలో వరి పంటను కూడా సాగు చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండటంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని అధికారులు విషయంలో వెంటనే చర్య తీసుకొని ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించి పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎత్తిపోతల పథకం కింద దాదాపు 500 ఎకరాలు భూములు ఉన్నాయని, వాటికి లెక్కలు లేవని టెక్నికల్ అసిస్టెంట్ సాంబశివుడు అన్నట్లుగా తెలుస్తోంది. వాస్తవానికి చాలామంది రైతులు కుందూ నది ద్వారా మోటర్లు వేసుకొని పంటలను సాగు చేసుకుంటూ ఉన్నారు. కేవలం 150 ఎకరాలకు పైగా ఉన్న ఆయకట్టు రైతులు పథకం ద్వారా నీటిని వినియోగించుకుంటున్నారు. మోటార్లు వేసుకుని నీరుపాలించుకున్న రైతులు నీటి శిస్తు పన్ను చెల్లించే దశలో లేరు. అదీగాక ప్రస్తుతం ఎత్తి పోతల పథకాన్ని ప్రారంభించాలంటే, ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు మోటార్ నిర్వహణకు దాదాపు 3 లక్షల రూపాయల దాకా ఖర్చు చేయాల్సి ఉంది. ఈ కారణంగా పెద్ద రైతులు ఎవరు పథకం నిర్వాహనకు ముందుకు రావడం లేదు. గతంలో ఇదే విషయంపై ఒకసారి రైతులతో ఆ శాఖ అధికారులు సమావేశం నిర్వహించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. గ్రామానికి చెందిన సుజాతమ్మ గతంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఎత్తిపోతల పథకాన్ని నిర్వహించేందుకు అధికార పార్టీ యంత్రాంగం ఇతరులు కట్టబెట్టాలని భగీరథ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఫలించడం లేదు. ఎత్తిపోతల పథకానికి సంబంధించి తాళాలను ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్ సాంబశివుడు సుజాత సుజాతమ్మను కోరినప్పటికీ, ఆమె మాత్రం తాళాలు ఇచ్చేందుకు సిద్ధంగా లేకపోవడం గమనార్హం. కావాలంటే తాళాలు పగలగొట్టుకొని పథకం నిర్వహించుకోమని అధికారులకు చెప్పడం జరిగింది.

పథకం నిర్వహణకు ఎవరిని నియమించిన తనకు అభ్యంతరం లేదని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు సహకరించాలని సుజాతమ్మ కోరినట్లు తెలుస్తోంది.

**నిర్ణయం తీసుకుంటాం ఏ ఈ నారాయణరెడ్డి**

ఎత్తిపోతల పథకానికి సంబంధించి నిర్వహణ విషయంపై చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఇంజనీర్ నారాయణరెడ్డి మంగళవారం రాత్రి పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం చేస్తామని నారాయణరెడ్డి పేర్కొన్నారు.

# మహిళా రక్షణకు 'శక్తి' కవచం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పోలీసుల అవగాహన సదస్సు!





**జూపాడుబంగ్లా: జూన్ :30: (నంది పత్రిక )** విద్యార్థుల రక్షణ కోసం జూపాడుబంగ్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని నందికొట్కూర్ రూరల్ సిఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నంద్యాల జిల్లా ఎస్.పి. ఆదేశాల మేరకు జూపాడుబంగ్లా లో కస్తూర్బా గాంధీ పాఠశాలలో "మహిళా భద్రత"శక్తి యాప్,బాల్య వివాహాలు పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ. కె మల్లికార్జున మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు సాంకేతికతను వాడుకోవాలని సూచించారు. ముఖ్యముగా 'శక్తి యాప్' ప్రతి ఒక్కరి మొబైల్ లో ఉండాలని, ఏదైనా ఆపద కలిగినప్పుడు ఈ యాప్ ద్వారా తక్షణ పోలీస్ సహాయం పొందవచ్చునని వివరించారు.

బాల్య వివాహాలను అరికట్టడంలో మహిళలు చైతన్యవంతులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే భయపడకుండా వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు. మీకు ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే అత్యవసర సమయంలో112, గృహహింసల బారిన పడితే 181, సైబర్ నేరాలకు1091, బాలలు సహాయం కోసం1098, సైబర్ నేరాలకు1930, మహిళా భద్రత కోసం 1091 వంటి హెల్ప్ లైన్ నెంబర్లకు సమాచారం అందించి సహాయం పొందాలని సూచించారు. మహిళలపై నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజల కోసం పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పారు. భయం విడిచి ఏ సమస్య వచ్చినా వెంటనే ఫిర్యాదు చేయాలనిపించారు. ప్రతి మహిళ తమ స్మార్ట్ ఫోన్లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవుడు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 3 న.రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ను విజయవంతం చేయండి



## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

**వై ఎస్ ఆర్ కడప బ్యూరో చీఫ్ జూన్ 30: నంది పత్రిక**

జిల్లా వాసుల చిరకాల స్వప్నం నెరవేర్చే దిశగా జిల్లా లోని జమ్మల మడుగు మండలం సున్నపు రాళ్ళ వద్ద జూలై 3 న స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన ను విజయ వంతం చేసేందుకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు..మంగళ వారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు జూలై 03 న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పై వివిధ శాఖల అధికారులకు విధుల కేటాయింపు సంబంధిత అంశాలకు సంబంధించి జిల్లా అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్,జేసి డా.నిధి మీనా, నగర కమిషనర్ భావన,డి ఆర్ ఓ మల్లికార్జునుడు, ఏ ఎస్ పి ప్రకాష్ బాబు లతో కలసి దిశా నిర్దేశం చేశారు...

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..** రాయల సీమ ప్రజల మరియు జిల్లా వాసుల చిరకాల స్వప్నం నెరవేర్చే దిశగా జిల్లా లోని జమ్మల మడుగు మండలం సున్నపు రాళ్ళ వద్ద జూలై 3 న స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పాటు కేంద్ర ఉక్కు సహాయ మంత్రి, పలువురు కేంద్ర మంత్రులు ఈ పర్యటన కు విచ్చేయనున్న నేపథ్యం లో జిల్లా పర్యటన ను విజయ వంతం చేసేందుకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని ఆదేశించారు.జూలై 03 న పర్యటన లో భాగంగా ముఖ్య మంత్రి తొలుత కన్యతీర్థందేవాలయం ను సందర్శించిన అనంతరం స్టీల్ ప్లాంట్ పనులకు ప్రారంభోత్సవం తదుపరి బహిరంగ సభ లో ముఖ్యమంత్రి పాల్గొన నున్నారని తెలిపారు..ఈ పర్యటన ను విజయ వంతం చేయడం లో స్టీల్ ప్లాంట్ యాజమాన్యం జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని కార్యక్రమాలకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పాటించేలా సంబందిత అధికారులుచర్యలుచేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ను విజయవంతంచేయడానికి జిల్లా అధికారులకు కేటాయిస్తున్న విధులను బాధ్యతా యుతంగా నిర్వహించాలని తెలిపారు.ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా వుండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భద్రతా,పార్కింగ్ అంశాలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్, గ్రీవిన్స్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ఈ మేరకు విధులు కేటాయించిన అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

**ఎస్ పి మాట్లాడుతూ...**

**ముఖ్యమంత్రి పర్యటన లో** వి ఐ పి,వి వి ఐ పి లకు గ్యాలరీ, పార్కింగ్,వెహికల్ పాసులు ఇచ్చే సమయం లో వారికి కేటాయించిన స్థలం ను పాసు నందు పొందు పరచాలని తెలిపారు.. భద్రతా పరంగా అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేయడం జరుగుతుందని తెలిపారు.. ఈ సమావేశంలో.. వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# చెన్నుపల్లి దళితుల భూములకు ఎప్పుడు హద్దులు..?

### 12 ఏళ్లుగా అధికారుల నిర్లక్ష్యం..



**బద్వేల్, జూన్ 30: (నంది పత్రిక)**కలసపాడు మండలం చెన్నుపల్లి గ్రామానికి చెందిన దళిత కుటుంబాల భూ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈరోజు బద్వేల్లో ప్రస్తావించారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మరియు బద్వేల్ ఆర్డీవోకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ముత్యాల ప్రసాద్ రావు మాట్లాడుతూ, కలసపాడు మండలం చెన్నుపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 269, 270, 271, 272, 273, 274, 276లో సుమారు 36 దళిత కుటుంబాలకు 2014లో డీకేటీ పట్టాలు, పాసుబుక్కులు మంజూరు చేసి ఆన్లైన్లో నమోదు చేశారని తెలిపారు.అయితే, వారికి కేటాయించిన భూములకు ఇప్పటి వరకు సబ్డివిజన్ చేసి హద్దులు చూపించకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఇదే సమస్యపై జిల్లా కలెక్టర్కు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు బద్వేల్ ఆర్డీవో గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించి, సబ్డివిజన్ పూర్తి చేసి హద్దులు చూపించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అయితే, కలసపాడు మండల రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దీంతో మరోసారి ఈరోజు బద్వేల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి కలసపాడు తహసీల్దార్కు సమస్యను పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెన్నుపల్లి గ్రామ దళిత కుటుంబాలకు సబ్డివిజన్ పూర్తి చేసి భూముల హద్దులు చూపించాలని బాధితులతో పాటు కలసపాడు మండలం సీనియర్ తెలుగు దేశం పార్టీ నాయకులు బాలరెడ్డి, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ముత్యాల ప్రసాద్ రావు డిమాండ్ చేశారు.

# మంత్రి లోకేష్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న నందవరం మోడల్ స్కూల్ విద్యార్థి



**మర్రిపాడు జూన్ 30నంది పత్రిక** : మర్రిపాడు మండలం నందవరం మోడల్ స్కూల్కు చెందిన విద్యార్థి పెసల గోవర్ధన్ పదవ తరగతి పరీక్షా ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్ అవార్డుకి ఎంపికై,మంగళగిరిలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా తన తల్లితో కలిసి ఈ అవార్డును అందుకున్నాడని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్ అవార్డుకు తమ పాఠశాల విద్యార్థి ఎంపికై అవార్డు అందుకోవడం తమకు ఎంతో గర్వకారణమని అన్నారు.ఈ అవార్డు ఇతర విద్యార్థులకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.పెసల గోవర్ధన్ సాధించిన ఈ విజయంపై ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియచేశారు.

# జులై 1 మేరువ చిన్న నరసింహారెడ్డి గారి జన్మదినం.

### బుధవారం సామాజిక సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చిన యువతరం.



**శిరివెళ్ల (నంది పత్రిక) :-** సిరివెళ్ల మండల పరిధిలోని కామినేనిపల్లె గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మేరువ చిన్న నరసింహారెడ్డి గారి జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన అభిమానులు ఆప్తులు శ్రేయోభిలాషులు గ్రామంలోని యువత బుధవారం ఉదయం నుండి పలు సామాజిక సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. శిరివెళ్ల మండలంలోనే మొదటిసారిగా అభిమాన నాయకుని జన్మదిన వేడుకల సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ఇదే మొదటి సారి అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం జులై 1 తేదీన నరసింహారెడ్డి గారి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా కామినేనిపల్లె గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తల సేమియా చిన్నారులు గర్భిణీ బాలింత మహిళల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మేరువ చిన్న నరసింహారెడ్డి గారి అభిమానులు తెలియజేశారు.

# స్కూల్ బస్సుల భద్రతపై కఠిన హెచ్చరిక.. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : బద్వేల్ (ఎం వి ఐ) వై.శేఖర్ రావు



**పోరుమామిళ్ల , జూన్ 30: (నంది పత్రిక)**వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల రవాణా విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని బద్వేల్ (ఎంవీఐ) శేఖర్ రావు సూచించారు. స్కూల్ బస్సులు మరియు ఇతర విద్యార్థుల రవాణా వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్, పర్మిట్, పొల్యూషన్ సర్టిఫికేట్ సహా అన్ని అవసరమైన పత్రాలు పూర్తి స్థాయిలో ఉండాలని ఆయన తెలిపారు.విద్యార్థుల భద్రతే అత్యంత ముఖ్యమని, స్కూల్ బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించడం, క్యాబిన్ పైభాగంలో లేదా ప్రమాదకరంగా కూర్చోబెట్టడం వంటి చర్యలు పూర్తిగా నిషేధించబడినవని హెచ్చరించారు. ముఖ్యంగా హెవీ లోడ్, ఓవర్ స్పీడ్ వాహనాల క్యాబిన్ పై విద్యార్థులను కూర్చోబెట్టి తరలించడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు.

నిబంధనలను ఉల్లంఘించే పాఠశాల యాజమాన్యాలపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ప్రయాణించే వాహనాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.విద్యార్థుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రైవేట్ స్కూల్స్ నిబంధనలు పాటించాలని( ఎంవీఐ ) వై.శేఖర్ రావు తెలిపారు.

# 40 డిగ్రీల వేడికే కరిగిపోతున్న యూరప్ రోడ్లు.. మన రోడ్లు ఎలా తట్టుకుంటున్నాయి?

యూరప్‌లోని పలు దేశాల్లో ఇటీవల నమోదవుతున్న 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలకే తారు రోడ్లు కరిగిపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది చూసిన చాలామందికి, 45 డిగ్రీల వేడిని సైతం తట్టుకునే మన రోడ్లతో పోల్చి, యూరప్ రోడ్ల నాణ్యతపై సందేహాలు వస్తున్నాయి. అయితే, ఇది నిర్మాణ లోపం కాదు, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించే శాస్త్రీయ ఇంజినీరింగ్ విధానమే దీనికి కారణం.

యూరప్ దేశాల్లో శీతాకాలంలో ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల కంటే తక్కువకు పడిపోతాయి. ఆ సమయంలో రోడ్లు గడ్డకట్టి పగుళ్లు రాకుండా ఉండేందుకు, అక్కడ మృదువుగా ఉండే 'సాఫ్ట్ బిటుమిన్' (తారులో ఒక రకం)ను ఉపయోగిస్తారు. ఇది చలిని బాగా తట్టుకుంటుంది, కానీ దీనికి వేడిని తట్టుకునే సామర్థ్యం తక్కువ. అందుకే, బయటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటినప్పుడు, సూర్యరశ్మికి నేరుగా వేడెక్కే రోడ్డు ఉపరితలం ఉష్ణోగ్రత 50-60 డిగ్రీలకు చేరి, తారు మెత్తబడి కరిగిపోతుంది.ఇందుకు భిన్నంగా, భారతదేశంలో ఏళ్ల తరబడి తీవ్రమైన వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా, అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే 'హార్డ్ బిటుమిన్' (గట్టి తారు)ను రోడ్ల నిర్మాణంలో వాడతారు. వీజీ-30, వీజీ-40 వంటి గ్రేడ్ల తారును ఉపయోగించడం వల్ల, 45 డిగ్రీల వేడిలో కూడా మన రోడ్లు స్థిరంగా ఉంటాయి. మన రోడ్లు వర్షాలకు, నిర్వహణ లోపం వల్ల పాడవుతాయే తప్ప, సాధారణంగా ఎండలకు కరిగిపోవు. క్లుప్తంగా చెప్పాలంటే, యూరప్ రోడ్లు చలిని, భారత రోడ్లు ఎండను తట్టుకునేలా నిర్మించబడ్డాయి. ఇది నాణ్యతకు సంబంధించిన విషయం కాదు, కేవలం ఆయా ప్రాంతాల వాతావరణానికి అనుగుణంగా తీసుకున్న ఇంజినీరింగ్ నిర్ణయం మాత్రమే. అయితే, వాతావరణ మార్పుల కారణంగా యూరప్‌లో పెరుగుతున్న తీవ్రమైన వేడి, వారి మౌలిక సదుపాయాలకు కొత్త సవాళ్లను విసురుతోందని స్పష్టమవుతోంది.



# ఈవిఎం ల భద్రతకు సంబంధించి ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదు

## ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలి - జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :-** ఈవిఎం ల భద్రతకు సంబంధించి ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న ఈవిఎమ్ గోడౌన్ ను కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఈవిఎమ్ గోడౌన్ ను పరిశీలిస్తూ ఈవిఎం ల భద్రతకు సంబంధించి ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలన్నారు. ఈవిఎం లకు సంబంధించిన భద్రత ఏర్పాట్లు, సీసీ టీవీ పర్యవేక్షణ, ఎంట్రీ ఎగ్జిట్ రిజిస్టర్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.. అదే విధంగా జిల్లాలో జరుగుతున్నటువంటి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమశీ పురోగతి గురించి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరిశీటెండెంట్ మురళి, తెలుగుదేశం పార్టీ లీగల్ జనరల్ సెక్రెటరీ ఎల్.వి.ప్రసాద్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణుడు, బిజెపి పార్టీ తరపున సాయి ప్రదీప్, వైఎస్ఆర్సిపి పార్టీ తరపున సములు, తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి

## విధి నిర్వహణ లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

## తహశీల్దార్లు బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్య సాధనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

## కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి నిర్దేశించిన గడువులోపు ఓటరు జాబితా డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశం పై కలెక్టర్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు .పనితీరు తక్కువగా ఉన్న బీఎల్ఓలను ప్రత్యేకంగా గుర్తించి, మెరుగైన పనితీరు కనబరుస్తున్న బీఎల్ఓల అనుభవాలను వెనుకబడిన బీఎల్ఓలతో పంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా వారు సమర్థవంతంగా పనిచేసే అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ చట్టబద్ధమైన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం1951 ప్రకారం ఎన్నికల విధులను నిర్వర్తించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. రోజుకు 6 నుంచి 7 గంటలు క్షేత్రస్థాయిలో పనిచేస్తే నిర్దేశిత లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. రోజుకు కనీసం 10 శాతం చొప్పున పనిని పూర్తి చేయాలని, అలా చేస్తే మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తిచేయడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. బిఎల్ఓ లు ఖచ్చితంగా ఇంటింటికీ వెళ్లాలని, అలా కాకుండా సచివాలయాలకు ప్రజలను పిలిపించకూడదన్నారు.కొన్ని మండలాల్లో బీఎల్ఓల పనితీరుపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా కల్లూరు మండలంలో పలువురు బీఎల్ఓలు పనులు ప్రారంభించకపోవడం, కొందరు రోజంతా ఒకటి లేదా రెండు నమోదులు మాత్రమే చేయడం వంటి అంశాలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లు బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాల సాధనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బిఎల్ఓ ల పై చర్యలకు ఫైళ్ళను పంపించాలని, అవసరమైతే సంబంధిత చట్టాల ప్రకారం శిక్షలు, జరిమానాల విధింపునకు చర్యలు ప్రారంభించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలూరు, గూడూరు, ఆస్పరి లాంటి మండలాలు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పురోగతి బాగా తీసుకొని వస్తున్నారని, ఆదోని అర్బన్, మంత్రాలయం, కర్నూలు అర్బన్, కల్లూరు, హోళగుంద మండలాలో మాత్రం పురోగతి చాలా వెనుకబడి ఉందని పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రేపు పెన్షన్ పంపిణీ సందర్భంగా ఎంపీడీఓలు తమ పరిధిలోని పింఛన్ లబ్ధిదారులకు ముందస్తుగా సమాచారం అందించి, కొత్త ఫోటో, ఎన్యూమరేషన్ ఫారం పూర్తిగా నింపి తీసుకురావాలని సూచించాలన్నారు. జనన సంవత్సరాన్ని బట్టి అవసరమైన పత్రాలను కూడా తప్పనిసరిగా సమర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. 1987కు ముందు జన్మించిన వారు తమ గుర్తింపు పత్రం సమర్పిస్తే సరిపోతుందని, 1987 నుంచి 2004 మధ్య జన్మించిన వారు తమ గుర్తింపు పత్రంతో పాటు తల్లి లేదా తండ్రిలో ఎవరో ఒకరి గుర్తింపు పత్రాన్ని సమర్పించాలన్నారు. 2004 తర్వాత జన్మించిన వారు తమ గుర్తింపు పత్రంతో పాటు తల్లిదండ్రులిద్దరి గుర్తింపు పత్రాలు, తాజా ఫోటో, పూర్తిగా నింపిన ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఏఈఆర్ఓలు (ూాజు=ాం) రేషన్ దుకాణాల వద్ద బీఎల్ఓలను (దీూాం) అందుబాటులో ఉంచి ప్రజలకు అవసరమైన సహాయం అందించాలన్నారు. పింఛన్, రేషన్ వంటి సేవల కోసం వచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని అర్హులైన ప్రతి ఓటరుని కవర్ చేయాలని, వలస వెళ్లిన వారి వివరాలను కూడా బంధువులు లేదా కుటుంబ సభ్యుల ద్వారా సేకరించి, అవసరమైతే ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తాజా ఫోటో, అవసరమైన పత్రాలు, ఎన్యూమరేషన్ ఫారం పొందాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.అంతకుముందు జాయింట్ కలెక్టర్ పురోగతిపై సమీక్షించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# 2026-27 జిల్లా వార్షిక రుణ ప్రణాళిక

## (ఏసీ పి)ను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి..




**వై ఎస్ ఆర్ బ్యూరో చీఫ్ జూన్ 30 నంది పత్రిక** వైఎస్ఆర్ కడప జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2026-27లో మొత్తం రూ.30,610 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించగా... ఇందు లో ప్రాధాన్యతా రంగానికి రూ.23,744 కోట్లు (77.6%) కేటాయించగా,ప్రాధాన్యతేతర రంగానికి రూ.6,867 కోట్లు (22.4%) కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని బోర్డు నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, డి ఆర్ ఓ మల్లికార్జునుడు,ఎల్ డి ఎం జనార్దనం,నాబార్డు డి డి ఎం విజయ విహారి,కడప ఆర్ డి ఓ మురళీ తో కలసి 2026-27 జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.... జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లో భాగంగా.....వ్యవసాయ రంగానికి అత్యధికంగా రూ.18,816 కోట్లు కేటాయించగా,ఇందు లో పంట రుణాలకు రూ.11,630 కోట్లు, వ్యవసాయ టర్మ్ లోన్లకు రూ.6,168 కోట్లు, అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలకు రూ.952 కోట్లు మరియు వ్యవసాయ మౌలిక వసతులకు రూ.66 కోట్లు ప్రతిపాదించామని తెలిపారు.వ్యవసాయేతర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (ఎం ఎస్ ఎం ఈ) అభివృద్ధికి రూ.4,088 కోట్లు కేటాయించారు. అదనంగా విద్యా రుణాలకు రూ.115 కోట్లు, గృహ రుణాలకు రూ.220 కోట్లు, సామాజిక మౌలిక వసతులకు రూ.10 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి రూ.46 కోట్లు మరియు ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.447 కోట్లు కేటాయించామనన్నారు.ఈ వార్షిక రుణ ప్రణాళిక ద్వారా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, పారిశ్రామికాభివృద్ధి మరియు సమగ్ర ఆర్థికాభివృద్ధికి అవసరమైన పరపతి అందించేందుకు బ్యాంకులు చర్యలు చేపట్టనున్నాయన్నారు..

# ఎలాంటి కష్టం వచ్చినా ప్రభుత్వం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

## సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 30 నంది పత్రిక** ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ మరోసారి తన సేవా దృక్పథాన్ని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చాటి చెప్పారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలోముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.36,00,530 విలువైన చెక్కులను అర్హులైన బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఊరటనిస్తోందని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకం అర్హులందరికీ చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా ప్రభుత్వం, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు గుండా మనీ తదితరులు పాల్గొన్నారు.



# కొలనుభారతిలో పురోహితుల మధ్య రగడ

-శ్రీశైలం దేవస్థానం పురోహితులకు, స్థానిక పురోహితులకు మధ్య వాగ్వివాదం

-కొలనుభారతిదేవి ఆలయంలో పూజలను అడ్డుకున్న స్థానిక పూజారులు

**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని ఏకైక సరస్వతీ క్షేత్రమైన శ్రీశైల దేవస్థానం దత్తత దేవాలయమైన కొలనుభారతి దేవి ఆలయంలో పురోహితుల మధ్య రగడ మొదలైంది. ఈనెల 23 వతేదిన శ్రీశైలం దేవస్థానం అధికారుల అనుమతి లేకుండా కొలనుభారతి క్షేత్రంలో నవచండీ యాగం కొంత మంది వ్యక్తులు నిర్వహించారు. ఈ విషమై శ్రీశైలం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు . ఆదేశాలతో ఏఈఓ ఫణిధర్ ప్రసాద్ ను ప్రత్యేక అధికారిగా నియమించి విచారణ జరిపించారు. విచారణలో ఆలయ సిబ్బంది ఇద్దరు. పురోహితులను విధుల నుంచి తొలగించారు శ్రీశైలం దేవస్థానం ఈఓ. అయితే ఆలయంలో పూజలు జరిపించేందుకు మూడురోజులు క్రితం ఈఓ ఆదేశాలతో పురోహితులు అమ్మవారి క్షేత్రంలో పూజలు చేసేందుకు వచ్చారు. అయితే స్థానిక పురోహితులు శ్రీశైలం నుంచి వచ్చిన పురోహితులు అమ్మవారికి పూజలు చేయకుండా అడ్డుకోవడంతోపాటు వాగ్వివాదానికి దిగారు. దీంతో శ్రీశైలం ఈఓ శ్రీనివాసరావు ఆదేశాలతో మంగళవారం ఏఈఓ ఫణిధర్ ప్రసాద్ కొలనుభారతి క్షేత్రాన్ని చేరుకొని శ్రీశైలం పూజాలతో పూజలు చేయించేందుకు సహకరించాలని స్థానిక పురోహితులను కోరాగా వారు ఈఓ ఆదేశాలను సహితం లేక్కలేకుండా పూజలను అడ్డుకున్నారు. ఈవిషయమై పురోహితులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని శ్రీశైల దేవస్థానం ఈఓకు పిర్యాదు చేస్తామని ఏఈఓ ఫణిధర్ ప్రసాద్ తెలిపారు.

## ఇక డాలర్‌తో పనిలేదు...

## భారత్-జపాన్ కీలక ఒప్పందం!

భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు అమెరికా డాలర్‌పై ఆధారపడకుండా, నేరుగా రూపాయి-యెన్‌లలోనే చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాయి. జులై 1 నుంచి 3 వరకు జపాన్ ప్రధాని సనా తకాయిచి భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపే భేటీలో ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# మహానందీశ్వరుని సేవలో ఎంపీ బాలశౌరి పూజలు

**మహానంది, జూన్ 30 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభానేని బాలశౌరి పూజలు నిర్వహించారు. మంగళవారం వీరికి ఆలయ పర్యవేక్షకులు సుబ్బారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం అధికారులు శేష వస్త్రంతో సత్కరించగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీ వెంట మండల జనసేన నాయకులు పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధే జిల్లా అభివృద్ధికి బలమైన పునాది

**కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరిలి**

**విద్యార్థుల నమోదు పెంపు, డ్రాప్‌అవుట్‌ల తగ్గింపుపై ప్రత్యేక దృష్టి**

**వలస కుటుంబాల విద్యార్థుల కోసం ముందస్తుగా సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు చేయాలి**

**పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు జిల్లాలో విద్యార్థుల నమోదు, హాజరు శాతం, ఉత్తీర్ణత శాతాన్ని పెంచడంతో పాటు డ్రాప్‌అవుట్‌లను గణనీయంగా తగ్గించేందుకు విద్యాశాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల విద్యాశాఖ హైలెవల్ కమిటీ జిల్లా పర్యటన సందర్భంగా నిర్వహించిన విద్యాశాఖ సమీక్షా సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ దేవానంద్ రెడ్డి, రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్, జిల్లా విద్యాశాఖ అధికారి జి. సుధాకర్, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు అధికంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికి పైగా విద్యార్థులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 60 ఉండగా, వాటిలో 20 పాఠశాలలు కర్నూలు జిల్లాలోనే ఉండటం జిల్లాకు ప్రత్యేకత అని తెలిపారు. జిల్లాలో డ్రాప్‌అవుట్‌ల తగ్గింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో వలసలు అధికంగా ఉండటం వల్ల విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతం ప్రభావితమవుతోందన్నారు. ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో కుటుంబాలు ఉపాధి కోసం గుంటూరు జిల్లాతో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వలస వెళ్తుండటంతో విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతోందని వివరించారు. వలస కుటుంబాలకు చెందిన విద్యార్థుల కోసం సీజనల్ హాస్టళ్లను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సిద్ధం చేసి సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు సీజనల్ హాస్టళ్లను నిరంతరం తనిఖీ చేసి లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని సూచించారు. జిల్లాలో బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల (కేజీబీవీ) సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో డ్రాప్‌అవుట్‌లను సుమారు నాలుగు వేల వరకు తగ్గించడంతో పాటు ఉత్తీర్ణత శాతాన్ని ఐదు శాతం మేర పెంచగలిగామని తెలిపారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో భవనాలు, స్లాబులు, గోడలు దెబ్బతిన్న పరిస్థితిలో ఉన్నాయని పేర్కొంటూ, విద్యార్థులకు సురక్షితమైన, అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు రూ. 140 కోట్ల పరిపాలనా అనుమతి లభించిందని, బడ్జెట్ విడుదల అనంతరం పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అదనపు తరగతి గదులు, గ్రీన్ బోర్డులు, నాణ్యమైన ఫర్నిచర్, మరుగుదొడ్లు, వంటశాలలు, ప్రహరీ గోడలు, మండల రిసోర్స్ సెంటర్లు తదితర సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో మైనారిటీలు అధికంగా ఉండటంతో పాటు పశ్చిమ ప్రాంతం రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటిగా ఉందన్నారు. పేదరికం, వలసలు, బాల్యవివాహాలు, టీనేజ్ గర్భధారణ వంటి సామాజిక సమస్యలు విద్యార్థుల విద్యపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాకు అదనపు వనరులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. టీనేజ్ గర్భధారణలు, బాల్యవివాహాలను అరికట్టడం ద్వారా బాలికల హాజరు, ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు రావాలనే ఆసక్తి కలిగేలా సురక్షితమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, మండల విద్యాధికారులు కూడా క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీల ఆధారంగా జిల్లాకు లభిస్తున్న ర్యాంకును మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే విద్యా ప్రమాణాల్లో గణనీయమైన మార్పు సాధ్యమవుతుందని కలెక్టర్ అన్నారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.



# శ్వాసను నిలిపే శ్వేత సైనికులకు సలాం!




**బొల్లు రామమోహన్,**

**రచయిత, పోరుమామిళ్ల**

**పోరుమామిళ్ల జూన్30: (నంది పత్రిక )**ఒక ప్రాణం భూమి మీదకు రావాలన్నా... ఉన్న ప్రాణం నిలబడాలన్నా... ఆ బ్రహ్మ దేవుడి తర్వాత మళ్లీ ఆ చేతులే కావాలి. స్టెతస్కోపును ఆయుధంగా చేసుకొని, తెల్లని కోటును కవచంగా తొడుక్కొని సమాజ ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమించే వైద్యులందరికీ జాతీయ డాక్టర్ల దినోత్సవ శుభాభినందనలు.

**జాతీయ డాక్టర్ల దినోత్సవ నేపథ్యం** భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై ఒకటవ తారీఖున 'జాతీయ డాక్టర్ల దినోత్సవం' అత్యంత ఘనంగా జరుపుకుంటారు. ప్రముఖ వైద్యుడు, స్వాతంత్ర సమరయోధుడు మరియు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి అయిన డాక్టర్ బిధాన్ చంద్రరాయి (బి.సి. రాయ్) గారి జన్మదినం మరియు వర్ధంతి ఒకే రోజు (జూలై 1) కావడం విశేషం. సమాజానికి ఆయన అందించిన అసమాన సేవలను స్మరిస్తూ, గౌరవార్థం ఈ రోజును డాక్టర్ల దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.

**నడిచే దైవం... వైద్యుడు** "వైద్యో నారాయణో హరిః" అంటే వైద్యుడు దేవునితో సమానం. దేవుడు ప్రాణం పోస్తే... ఆ ప్రాణానికి వచ్చే ప్రతి ముప్పును ఎదుర్కొని, కంటికి రెప్పలా కాపాడే నడిచే దైవం వైద్యుడు. గుడిలో ఉన్న దేవుడిని మనం కళ్ళతో చూడలేకపోవచ్చు, కానీ ఆపదలో ప్రాణాలు నిలిపే వైద్యుడి రూపంలో ఉన్న దైవాన్ని మనం ప్రతిరోజు చూస్తూనే ఉంటాం. రోగుల ఆరోగ్యమే తమ ధ్యేయంగా భావించి, పగలు రాత్రి తేడా లేకుండా సేవ చేయడం వైద్య వృత్తి యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తుంది.

**నిద్రలేని రాత్రులు... నిలకడైన శ్వాసలు** వైద్యులు తమ జ్ఞానం, నైపుణ్యం మరియు అంకితభావంతో అనేకమంది ప్రాణాలను కాపాడుతూ సమాజానికి అమూల్యమైన సేవలు అందిస్తున్నారు. కంటినిండా నిద్రను సైతం త్యాగం చేసి... ఎదుటివారి గుండెల్లో నిబ్బరాన్ని, పేదవారి పెదవులపై చిరునవ్వును నింపే నిరంతర శ్రామికుడు వైద్యుడు. వారి త్యాగం, సేవాభావం మానవత్వానికి నిలువెత్తు ప్రతీకలు.

**స్టెతస్కోప్: ఒక నమ్మకమైన బంధం** వైద్యుడి మెడలోని స్టెతస్కోప్ కేవలం ఒక పరికరం కాదు, అదొక నమ్మకమైన బంధం. రోగి గుండె చప్పుడును కేవలం వినడమే కాదు... ఆ చప్పుడు వెనుక ఉన్న ఆందోళనను, భయాన్ని కనిపెట్టి, ప్రాణాన్ని నిలబెట్టే మంత్రదండం ఆ స్టెతస్కోప్.

**ఆధునిక కాలపు సంజీవని** రామాయణంలో లక్ష్మణుడి ప్రాణం కాపాడడానికి హనుమంతుడు సంజీవని మూలికను తెచ్చాడు. నేడు ప్రతి ఆసుపత్రిలోనూ, ప్రతి పేదవాడి ప్రాణాన్ని కాపాడడానికి మన డాక్టర్లు ఆధునిక కాలపు సంజీవనిలా మారుతున్నారు. విపత్కర పరిస్థితులు, అంటువ్యాధులు దేశాన్ని చుట్టుముట్టినప్పుడు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, సమాజాన్ని ముందుండి నడిపించేది వీరే.

**ముగింపు** వైద్య వృత్తి అనేది కేవలం ఒక వ్యాపారం కాదు, అదొక నిరంతర జీవన యజ్ఞం. డాక్టర్ల దినోత్సవం సందర్భంగా ప్రతి వైద్యుడి సేవలను గౌరవంగా స్మరించుకోవడం మన బాధ్యత. సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తూ, మానవ సేవలో తరిస్తున్న ప్రతి ఒక్క డాక్టర్కు శిరస్సు వంచి నమస్కరిస్తూ... శ్వేత సైనికులకు సలాం!




# ఓటరు జాబితా డిజిటైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాం



**కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఓటరు జాబితా డిజిటైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, న్యూ ఢిల్లీ అధికారులకు వివరించారు. మంగళవారం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా , న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశం పై ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా , న్యూ ఢిల్లీ అధికారులకు వివరిస్తూ జిల్లాలో మొత్తం 20,86,000 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 80.47% మ్యాపింగ్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈఎఫ్ డిస్ట్రిబ్యూషన్ (ఇూ×జ కార్డ్ పంపిణీ) లో 95% కి చేరుకున్నాం అన్నారు. ఈఎఫ్ డిజిటైజేషన్ కొంచెం నెమ్మదిగా సాగుతోందని, దానిపైన ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. ప్రస్తుతం 19% సాధించామని అంటే 3,96,000 డిజిటైజేషన్ చేయడం జరిగిందన్నారు. రోజుకు 1,20,000 చొప్పున లక్ష్యం పెట్టుకున్నామని, జూలై 14 నాటికి డిజిటైజేషన్ ను పూర్తి చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ క్షేత్రస్థాయి పరిశీలనలో గమనించిన అంశాలను ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అధికారులకు వివరించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లినప్పుడు కుటుంబ సభ్యుల పాత ఓటరు గుర్తింపు కార్డు (ఇూ×జ) అందుబాటులో ఉంటే వివరాలను కేవలం రెండు నుంచి మూడు నిమిషాల్లోనే ధృవీకరించి డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేయగలుగుతున్నారని తెలిపారు. అయితే, పాత ఓటరు గుర్తింపు కార్డు అందుబాటులో లేకపోవడం లేదా ఓటరు గతంలో నమోదైన నియోజకవర్గం వివరాలు తెలియకపోవడం వల్ల శోధన ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతోందన్నారు. ముఖ్యంగా ఒకే పేరుతో అనేక మంది ఓటర్లు నమోదై ఉండటంతో సరైన వివరాలను గుర్తించడం కష్టతరమవుతోందని జాయింట్ కలెక్టర్ వివరించారు.. ఓటర్లు తమ పాత ఓటరు గుర్తింపు కార్డు లేదా గతంలో నమోదైన నియోజకవర్గానికి సంబంధించిన వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని చెబుతున్నామని, తద్వారా ఓటరు వివరాల ధృవీకరణ, డిజిటైజేషన్ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరిశీటెండెంట్ మురళి, తదితరులు పాల్గొన్నారు.




# క్షణికావేశంతో యువకుడు ఆత్మహత్య



**కొత్తపల్లి - నంది పత్రిక :** క్షణికావేశం ఒక నిండుప్రాణాన్ని బలిగొన్న ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడడంతో ఆగ్రామంలో విషాదఛాయలు నెలకొన్న వైనం. ఎస్ఐ జయశేఖర్ మంగళవారం రాత్రి తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన సంజపోగు కళ్యాణ్(20) హిందూ దేవుళ్లను ఆరాధించేవాడు. అయితే మరికొన్ని రోజుల్లో అక్క వివాహం జరిపించేందుకు కుటుంబికులు నిశ్చయించారు. కాకపోతే పెళ్లి పత్రికలపై ఏసు క్రీస్తు శిలువ బొమ్మ ముద్రించినారని మృతుడు కళ్యాణ్కు ఇష్టం లేక తీసివేయమని తన తండ్రితో చిన్న వాగ్వివాదం చేశాడని చెప్పారు. తండ్రి కురుమయ్య పత్రికలను ముద్రించినాము తీసివేయడం కుదరదు అని చెప్పినాడు. దీంతో యువకుడు మనస్తాపం చెంది తన ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఫ్యాన్కు తాడుతో ఉరివేసుకొని క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయమై తండ్రి కురుమయ్య పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయ శేఖర్ వెల్లడించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 30 ( నంది పత్రిక )** పేద ప్రజలు ఆపదలో ఉంటే 'నేనున్నాను' అని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి మంచి మనసుకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు ముగ్గురికి 5 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఎక్కువ ఆక్సిడెంట్స్ మరియు అనారోగ్య కారణాల వల్ల వచ్చే వారికి ఆరోగ్యం విషయంలో అజాగ్రత్త వహించకుండా జాగ్రత్తలు వహించాలని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పేద ప్రజలు ఏదైనా ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, లేదా ఆరోగ్య పరంగా ప్రాణాల మీదకు వచ్చినప్పుడు అత్యవసరంగా ఆపరేషన్లకు కావల్సిన డబ్బులు లేకపోవడం, ,వారి స్థోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు నాకు విన్నవించుకున్న సందర్భంలో వారి ఆవేదన విని, అప్పటికప్పుడు దగ్గరుండి సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారన్నారు. అలా పేదవారి ఆపరేషన్ల ఖర్చుకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ముగ్గురికి వచ్చిన 5 లక్షల రూపాయలను చెక్కుల రూపంలో మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



# పెద్దాయనగా ప్రజల్లో మంచి పేరు సాధించిన ఎస్సై నజీర్ హుస్సేన్ పదవి విరమణ



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 30 ( నంది పత్రిక )** పోలీస్ అంటే ఇలా ఉండాలి అనే విధంగా ఎస్ఐ నజీర్ హుస్సేన్ విధులు నిర్వహించారు. నంద్యాలలో పలు పోలీస్ స్టేషన్లో పనిచేసి, ఫ్రెండ్లీ పోలీస్ అంటేనే అర్థం వచ్చేలా విధులు నిర్వహించారు. పోలీస్ అంటే ఇలా ఉంటారా అనే విధంగా ఎస్సై నజీర్ హుస్సేన్ విధులు నిర్వహించారు. ఎలాంటి మచ్చ లేకుండా నిజాయితీతో పనిచేసి ప్రజలతోనూ పోలీస్ ఉన్నతాధికారుతో సౌమ్యనిగా మంచి మనిషిగా పేరు తెచ్చుకున్నారు. తాను పోలీస్ శాఖలో 09/12/1983న కర్నూలు ఏఆర్ లో నియామకం జరిగింది (1990 వరకు)విధులు నిర్వహించారు. ఆ తర్వాత 1990లో సివిల్ పోలీసు విభాగంలోకి జూపాడు బంగ్లా పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లడం జరిగింది. 1993 నుండి 1996 వరకు పగిడ్యాల పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహించారు 1996 నుండి 2001 వరకు కోలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ 2001 నుండి 2004 వరకు నంద్యాల 2-టౌన్ పోలీస్ స్టేషన్ విధులు నిర్వహించి పోలీస్ అంటేనే ఇలా ఉండాలి అనే విధంగా పనిచేశారు అక్కడి నుండి బదిలీపై వెళ్లి 2004 నుండి 2005 వరకు ఉలిందకొండ పోలీస్ స్టేషన్ 2005 నుండి 2010 వరకు పాణ్యం పోలీస్ స్టేషన్ విధులు నిర్వహించారు అనంతరం 2010లో హెడ్ కానిస్టేబుల్ (హెచ్ సి)గా పదోన్నతి పొంది నంద్యాల 1-టౌన్ పోలీస్ స్టేషన్‌లో (2013 వరకు) పనిచేశారు 2013లో ఏఎస్ఐగా పదోన్నతి పొంది నంద్యాల 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో (2019 వరకు)పనిచేశారు ఆ తర్వాత సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా పదోన్నతి పొంది వైయస్సార్ కడప జిల్లాలోని రాజంపేట అర్బన్ పోలీస్ స్టేషన్ లో 2020 వరకు పనిచేశారు వైయస్సార్ కడప జిల్లా నుండి అప్పటి కర్నూలు జిల్లాకు బదిలీపై వచ్చి నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐగా విధులు నిర్వహించారు 2021 లో నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ పై వెళ్లారు 2021 నుండి 2024 వరకు పోలీస్ ఉన్నతాధికారులు మెచ్చేలా విధులు నిర్వహించారు అనంతరం సాధారణ ఎన్నికల విధుల్లో భాగంగా వైయస్సార్ కడప జిల్లాకు (06/02/2024 నుండి 27/08/2024 వరకు)బదిలీ పై విధులు నిర్వహించారు ఆ తర్వాత నంద్యాల జిల్లాకు బదిలీపై వచ్చి నంద్యాల జజూ పోలీస్ స్టేషన్‌లో నియామకం, అనంతరం నంద్యాల తాలూకా అర్బన్ పోలీస్ స్టేషన్ కు అటాచ్ చేయబడ్డారు అప్పటినుండి (01/09/2024 నుండి ప్రస్తుతం 2026 వరకు) ప్రస్తుతం పదవి విరమణ కాలం వరకు విధులు నిర్వహించి ప్రజల్లో ఉత్తమ పోలీస్ గా పేరు తెచ్చుకున్న పెద్దాయనగా పేరు తెచ్చుకున్న నజీర్ అహ్మద్ ఎస్ఐగా పదవి విరమణ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



## జీ.జీ.హెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేశ్వరమ్మ ఉద్యోగ విరమణ వేడుకలు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జి జి హెచ్ ) అసిస్టెంట్ డైరెక్టర్ (ఏ డి ) మల్లేశ్వరమ్మ ఉద్యోగ విరమణ వేడుక ఆసుపత్రిలోని ధన్వంతరి హాల్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు ఆమెను సత్కరించి, మాట్లాడారు:"వేలాది మంది రోగులు వచ్చే జీజీహెచ్‌లో మల్లేశ్వరమ్మ ఎంతో ఓపికతో, నిబద్ధతతో అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలను నిర్వహించారు."""ఆసుపత్రి సిబ్బంది అందరినీ సమన్వయం చేస్తూ, రోగులకు మెరుగైన సేవలు అందేలా ఆమె చేసిన కృషి అందరికీ ఆదర్శనీయం." ఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి కార్యాలయ సిబ్బంది మల్లేశ్వరమ్మ తో కేక్ కట్ చేయించి, తమ ఆత్మీయతను చాటుకున్నారు. సూపరింటెండెంట్ తో పాటు ఆర్.యం.ఓ డా వెంకట రమణ, సి.ఎస్.ఆర్.ఎమ్.ఓ డాక్టర్ పి. పద్మజ, డిప్యూటీ సి.ఎస్.ఆర్.ఎమ్.ఓ వి. పద్మజ, అడ్మినిస్ట్రేటర్ డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రమణ్యం, వైద్యులు, సిబ్బంది మరియు మల్లేశ్వరమ్మ కుటుంబ సభ్యులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# తృణమూల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

### పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై అత్యవసర విచారణకు నో

తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న టీఎంసీ విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. టీఎంసీ బ్యాంక్ ఖాతాల నిలిపివేత కారణంగా పార్టీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, తక్షణ విచారణ అవసరమని ఆ పార్టీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే ఈ అంశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటూ కోల్‌కతా హైకోర్టు వెంటనే విచారణ చేపట్టేందుకు నిరాకరించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ అమృతా సిన్హా సాధారణ లిస్టింగ్ ప్రక్రియ ప్రకారమే పిటిషన్ విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు బ్యాంక్ ఖాతాలు స్తంభించిపోయాయి. ఖాతాలు ఫ్రీజ్ చేయడం వల్ల ఆ పార్టీ రోజువారీ కార్యకలాపాలు, ఉద్యోగుల చెల్లింపులు, సంస్థాగత వ్యయాలు, రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని టీఎంసీ న్యాయవాదులు వాదించారు. అయితే హైకోర్టు తక్షణ ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించడంతో టీఎంసీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేసు విచారణకు వచ్చే వరకు ఆ పార్టీ నేతలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిలా ఉండగా, కోల్‌కతా హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

## భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ క్లినిక్స్ సమర్థవంతమైన వేదిక

### 23 విడతల్లో 327 దరఖాస్తులకు పరిష్కారం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 30 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందిస్తూ ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ తో పాటు భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా ప్రజల భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. 2025 డిసెంబర్ 29న ప్రారంభమైన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 2026 జూన్ 29 నాటికి మొత్తం 23 విడతలు నిర్వహించామని తెలిపారు. ఈ కాలంలో జిల్లావ్యాప్తంగా 881 దరఖాస్తులు అందగా, వాటిలో 327 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. నిబంధనలకు అనుగుణంగా 177 దరఖాస్తులను తిరస్కరించగా, ప్రస్తుతం 377 దరఖాస్తులు వివిధ దశల్లో పరిష్కార ప్రక్రియలో ఉన్నాయని వెల్లడించారు. డివిజన్‌ల వారీగా వివరాలను వెల్లడిస్తూ, భీమవరం డివిజన్ పరిధిలోని ఏడు మండలాల నుంచి 386 దరఖాస్తులు అందాయని, వాటిలో 141 దరఖాస్తులను పరిష్కరించగా, 71 దరఖాస్తులను తిరస్కరించామని, 174 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. నరసాపురం డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల నుంచి 312 దరఖాస్తులు అందగా, 127 దరఖాస్తులను పరిష్కరించామని, 62 దరఖాస్తులను తిరస్కరించామని, 123 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల నుంచి 183 దరఖాస్తులు అందగా, 59 దరఖాస్తులను పరిష్కరించామని, 44 దరఖాస్తులను తిరస్కరించామని, మిగిలిన 80 దరఖాస్తులపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి అందిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యల పరిష్కారం వేగవంతమవుతోందని, భూ హక్కులకు సంబంధించిన సమస్యలు ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.

# ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి

### - ఉపాధ్యాయులు కే ప్రసాద్

**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 30 నంది పత్రిక** ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఉపాధ్యాయులు కే ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలోని పాలసాగరం జిల్లా పరిషత్ హై స్కూల్ లో రిటైర్డ్ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సన్మాన సభ లో పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు ప్రసాద్ మాట్లాడుతూ ఆళ్లగడ్డ మండలం చింతకుంట గ్రామంలో జన్మించామని అనంతరం ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఆళ్లగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేశామని అనంతరం ఇంటర్ తర్వాత టీచర్ ట్రైనింగ్ చేసినట్లు అనంతరం 1984లో కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలం చెన్నంపల్లి లో ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించినట్లు కర్నూల్ జిల్లాలోని ఆళ్లగడ్డ కోయిలకుంట్ల తాలూకాల లోని అన్ని ప్రాంతాలలో 42 సంవత్సరాలు సుదీర్ఘంగా ఉపాధ్యాయులుగా పనిచేసే నేడు ఆళ్లగడ్డ పట్టణంలోనే ఉపాధ్యాయులుగా పదవి విరమణ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. తాను ఉపాధ్యాయునిగా పనిచేసిన ప్రాంతాలలో అందరు సహకరించారని అన్నారు అనంతరం ప్రధానోపాధ్యాయులు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రసాద్ 42 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు చేసి అందరి మన్ననలు పొందారని ఆయన శేషజీవితం ప్రశాంతమైన వాతావరణంలో



గడవాలని, ఆయూరారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రసాద్ దంపతులను సహచర ఉపాధ్యాయులు,, కుటుంబీకులు,బంధుమిత్రులు పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు కేటీ నాగరాజు ఎస్వీఎస్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.55 లక్షలతో నిర్మించిన పోలీస్ కార్యాలయ సీసీ రహదారిని ప్రారంభించిన ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు



**భీమవరం (పాలకోడేరు) , బ్యూరో చీఫ్ జూన్ 30, నంది పత్రిక** పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో రూ.55 లక్షల వ్యయంతో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నిర్మించిన పోలీస్ కార్యాలయం సీసీ రహదారిని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి, ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంయుక్తంగా ప్రారంభించారు. శ్రీనిలయం నుంచి అల్లూరి వెంకట నాగార్జున ఇంటి వరకు నిర్మించిన ఈ సీసీ రహదారి ప్రారంభోత్సవం సందర్భంగా ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులను ప్రభుత్వం ఒక్కటే చేపట్టడం కష్టసాధ్యమని, దాతల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని, అభివృద్ధి అనేది ఒక్కరోజులో జరిగేది కాదని, నిరంతర కృషితో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం డివిజన్ డీఎస్పీ రఘువీర్ విష్ణు, పంచాయతీ కార్యదర్శి కె. గౌరీ భవాని, గొల్లలకోడేరు ప్రత్యేక అధికారి ఎంవీఎస్ రాంప్రసాద్, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఘనమైనది





### నా విజయం వెనుక కుటుంబ సభ్యుల సహకారం ఉంది

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గంగన్న

**ఆళ్లగడ్డ, ప్రతినిధి జూన్ 30 నంది పత్రిక** తన కుటుంబ సభ్యులు మిత్రుల శ్రేయోభిలాషుల సహకారంతోనే అధ్యాపకుడిగా సమాజ సేవకుడిగా విజయం సాధించానని ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చౌట గంగన్న తెలిపారు. మంగళవారం ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదవి విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు హాజరై గ్రంధాల అధ్యాపకుడిగా వైస్ ప్రిన్సిపాల్ గా, ఇంచార్జి ప్రిన్సిపల్ గా ఆయన చేసిన సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సన్మాన సభ కళాశాలలో ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఒక వ్యక్తి అధ్యాపకుడిగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలంటే భార్య సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ గంగన్న క్రమశిక్షణతో అంకితభావంతో ఎంతో సేవ చేశారన్నారు. పేద విద్యార్థులకు, పేద మహిళలకు అదేవిధంగా తాను జన్మించిన ఊరికి బంధుమిత్రులకు ఎంతో ఆర్థిక భరోసా, మార్గదర్శిగా ఉన్నారని కొనియాడారు. సన్మాన గ్రహీత డాక్టర్ గంగన్న మాట్లాడుతూ తాను చేసిన ప్రతి పని అంకితభావంతో, ధర్మబద్ధంగా ఎటువంటి లాభం లేకుండా సేవ చేశానన్నారు. క్రింది స్థాయి నుంచి వచ్చిన వారికి కష్టాలు బాధలు తెలుస్తాయని వివరించారు. తన నుంచి సాయం పొందిన వారు ఎంతో కృతజ్ఞత భావాన్ని వ్యక్తం చేశారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ లక్ష్మిరెడ్డి, పుష్ప రాజ్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు నాగ మస్తాన్, జయచంద్రుడు, ప్రహ్లాదుడు, గాయత్రి, విజయలక్ష్మి కార్యాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పదవి విరమణ చేస్తున్న డాక్టర్ గంగన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని విరాళంగా అందించారు.

# ఆళ్లగడ్డ పట్టణఅభివృద్ధికి శ్రీకారం



### మన భూమా మన ధీమా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

### సమస్య మీది పరిష్కారం నాది ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, ప్రతినిధి జూన్ 30 నంది పత్రిక** ఆళ్లగడ్డ అభివృద్ధి తమ ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు.ఈ సందర్భంగా మంగళవారం నాడు పట్టణంలో ఆళ్లగడ్డ అభివృద్ధికి ఆమె శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పట్టణంలోని కోయిలకుంట్ల రోడ్డులోని 159 బూత్ లోని సమస్యాత్మక ప్రాంతాన్ని మంగళవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్వయంగా పరిశీలించారు. వార్డు మొత్తం నడుచుకుంటూ తిరుగుతూ ప్రజలతో నేరుగా మాట్లాడి, డ్రైనేజీ, రోడ్లు, మురుగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో డ్రైనేజీ కాల్వలు, రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేసి టెండర్లు కూడా పూర్తయ్యాయని, అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులను రద్దు చేయడంతో ప్రజలు ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం అధికారులు సూచించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించి, అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకువచ్చి 4,5 నెలల్లో శాశ్వత డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. దీనికోసం మంత్రి నారాయణ, ముఖ్యమంత్రితో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కోయిలకుంట్ల రోడ్డులో గతంలో నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండడంతో వర్షపు నీరు నిలిచిపోవడం, ఓపెన్ కాల్వల కారణంగా చిన్నారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ ఆక్రమణలను తొలగించి కొత్తగా శాస్త్రీయంగా కాల్వలు నిర్మించి రోడ్లపై మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు సోషల్ మీడియా, మీడియా లేదా నేరుగా తమ కార్యాలయం ద్వారా తెలియజేసే ప్రతి సమస్యను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిధులు సమకూర్చి పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే "మన భూమా మన ధీమా" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వారానికి మూడు రోజులు గ్రామాలు, వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలు, పార్టీ కార్యకర్తలను వారి ఇళ్ల వద్దే కలిసి సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను మరవకుండా వారి కుటుంబాలను కూడా పరామర్శిస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

పట్టణం, మండలాలు, గ్రామాల్లో క్రమం తప్పకుండా పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హుసేన్ బాష, సిద్దంరెడ్డి జాఫర్ రెడ్డి, నాగాంజనేయులు, సోముల శేఖర్ రెడ్డి , మున్సిపాలిటీ శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి టిడిపి నాయకులు భూమా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







## ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో, వేగవంతమైన సేవలు అందించేందుకు రెవెన్యూ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి:

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 30, నంది పత్రిక** ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో, వేగవంతమైన రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రతి రెవెన్యూ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా, ప్రతి వినతిని సకాలంలో పరిష్కరించే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆమె ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షత వహించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి 22ఏ కేసులు, రీ-సర్వే, పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్స్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, ఐవీఆర్ఎస్ తదితర అంశాల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న ప్రతి ఫైలు ఒక కుటుంబం, ఒక జీవితం, ఒక హక్కుతో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై నిర్లక్ష్యం ప్రదర్శించకుండా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ రికార్డుల ప్రక్షాళన, భూస్వామ్య హక్కుల పరిరక్షణలో రీ-సర్వే కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం 22ఏ కేసుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గతంలో పొరపాటున 22ఏ జాబితాలో నమోదైన ప్రైవేటు భూములకు సంబంధించిన సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించే బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందన్నారు. ప్రభుత్వ, దేవాదాయ భూములు మినహా ఇతర ప్రైవేటు భూములు 22ఏ జాబితాలో ఉండకూడదని స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తమ పరిధిలో సమస్య పరిష్కారం కాని పరిస్థితుల్లో సంబంధిత కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ ఫిర్యాదుదారులకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను నివారించేందుకు నిరంతర పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను సంరక్షించడం రెవెన్యూ శాఖ ప్రధాన బాధ్యత అని, ఆక్రమణలపై అప్రమత్తంగా ఉండి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని ఆమె సూచించారు. అధికారులు సమర్థవంతంగా పనిచేస్తే ప్రజల నుంచి సానుకూల స్పందనతో పాటు ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సేవల నాణ్యత పెంపుదల కోసం అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ పరిపాలనలో అత్యున్నత ప్రాధాన్యత అని పేర్కొంటూ, ప్రతి అధికారి ప్రజా సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, నర్సాపురం ఆర్డీవో దాసిరాజు, తాడేపల్లిగూడెం ఆర్డీవో సూర్యారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లాలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించినప్పుడే కుటుంబాలు బలోపేతం అవుతాయి





### నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**వీరవాసరం బ్యూరో చీఫ్ జూన్ 30, నంది పత్రిక** మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబ వ్యవస్థ మరింత బలపడుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. మంగళవారం వీరవాసరం మండలం తోలేరు గ్రామంలోని కామన్ ఫెసిలిటీ సెంటర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, ఆప్కో మరియు సెర్ప్ సంయుక్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ కుట్టు మిషన్‌పై నెల రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలతో జిల్లా కలెక్టర్ ముచ్చటించి, వారు స్వయం సహాయక సంఘాల ద్వారా పొందిన రుణాలను ఏ విధంగా వినియోగిస్తున్నారు, ఎలాంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు, ఎంత మేర ఆదాయం పొందుతున్నారు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళల ఆర్థిక పురోగతిపై ఆసక్తి కనబరిచి, వారి అనుభవాలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, మహిళల సాధికారతే కుటుంబాల అభివృద్ధికి పునాది అని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు ఉపాధి కల్పించే నైపుణ్య శిక్షణలను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళ తనకు లభించే అవకాశాలను వినియోగించుకొని స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలని పిలుపునిచ్చారు. వీరవాసరం, మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు తదితర ఎనిమిది మండలాలకు చెందిన 40 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ ప్రత్యేక శిక్షణను సెర్ప్, ఆప్కో శాఖలు సంయుక్తంగా అందిస్తున్నాయని తెలిపారు. ఒక నెలపాటు కొనసాగే ఈ శిక్షణలో ఇండస్ట్రియల్ కుట్టు మిషన్ నిర్వహణ, దుస్తుల తయారీ, బ్యాగుల తయారీ తదితర అంశాల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు ఆప్కోలో చొక్కాలు, బ్యాగులు తదితర ఉత్పత్తుల తయారీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు ఉపాధి పొందడమే కాకుండా, భవిష్యత్తులో స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్య ప్రాధాన్యతపై కూడా జిల్లా కలెక్టర్ మహిళలకు సూచనలు చేశారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి అనేక సౌకర్యాలు ఉచితంగా లభించడం వల్ల కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు అధిక ఫీజులు చెల్లించడం కంటే, ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యం, ఉన్నత విద్య కోసం వినియోగించడం కుటుంబానికి మరింత ప్రయోజనకరమని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎస్.ఎస్. వేణుగోపాల్, తహసీల్దార్ రామాంజనేయులు, తోలేరు గ్రామ సర్పంచ్ కె.లీలా కృష్ణ, ఎక్స్ ఎంపీపీ వీరవల్లి చంద్రశేఖర్, లెస్ పార్క్ సభ్యురాలు జి.అమ్మాజీ, డీఆర్డీఏ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## వైకల్యం కంటే సామర్థ్యమే ముఖ్యం

### దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణ

**భీమవరం: బ్యూరో చీఫ్ జూన్ 30, నంది పత్రిక** వైకల్యం కంటే సామర్థ్యమే ముఖ్యమని, దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగి అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం భీమవరంలోని ఆర్.ఆర్.డి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగుల కోసం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఉద్యోగం పొందిన అభ్యర్థులు తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించి సంస్థల మన్ననలు పొందాలని సూచించారు. దివ్యాంగులమనే భావనతో ఎప్పుడూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, స్వయం ఉపాధి లేదా ఉద్యోగం ద్వారా తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. దివ్యాంగులు ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం మరియు ప్రైవేట్ సంస్థలు కలిసి వారికి ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను మరింత విస్తృతంగా అందిస్తున్నాయని తెలిపారు. విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నత లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని ఆమె అన్నారు. ఈ మెగా జాబ్ మేళాకు హాజరైన 45 మంది దివ్యాంగ నిరుద్యోగ యువతలో మొత్తం 25 మంది వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందదాయకమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించబడిందని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అర్హత ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేసినట్లు చెప్పారు. జాబ్ మేళాలో 8 ప్రముఖ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని వివిధ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. దివ్యాంగులు ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా తమ ప్రతిభతో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి, ఆర్థిక సాధికారతకు అవసరమైన సహాయ సహకారాలను నిరంతరం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.లోకమాన్, ఉభయ గోదావరి జిల్లాల దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, సంఘ సేవకులు డాక్టర్ యు.వి రమణ రాజు, ఆర్.ఆర్.డి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె. ప్రసన్న, ఎన్‌సీఎస్ యంగ్ ప్రొఫెషనల్ సి.ఎం. కిషోర్ రెడ్డి, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎస్. లక్ష్మీకాంతం, ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ కోఆర్డినేటర్ పి. అరవింద స్వామి, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.





## జిల్లాలో జూలై 1న 2,20,625 మంది లబ్ధిదారులకు రూ.96.06 కోట్ల సామాజిక పింఛన్ల పంపిణీ

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 30 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను మరింత బలోపేతంచేసే దిశగా జూలై 1వ తేదీన విస్తృత స్థాయిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కింద జిల్లావ్యాప్తంగా 25 రకాల పింఛన్లకు సంబంధించి మొత్తం 2,20,625 మంది లబ్ధిదారులకు రూ.96,05,83,500 విలువైన పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. ప్రతి నెల మాదిరిగానే ఈసారి కూడా పింఛన్లను లబ్ధిదారులకు సమయానికి అందించేందుకు సంబంధిత స్వర్ణ వార్డు మరియు స్వర్ణ గ్రామ సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జూలై 1వ తేదీ ఉదయం నుంచే సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నేరుగా పింఛన్లు అందజేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పంపిణీ ప్రక్రియలో పారదర్శకత, సమర్థత పాటించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గౌరవప్రదంగా సేవలు అందించాలని సూచించారు. పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, మర్యాదపూర్వకంగా పింఛన్లు అందజేయాలని కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. పంపిణీ సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి పింఛన్ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఆచంట నియోజకవర్గంలో 28,127 మంది లబ్ధిదారులకు రూ.12,19,57,500

భీమవరం నియోజకవర్గంలో 29,971 మందికి రూ.13,13,23,800

నరసాపురం నియోజకవర్గంలో 26,535 మందికి రూ.11,39,67,000

పాలకొల్లు నియోజకవర్గంలో 28,488 మందికి రూ.12,35,27,000

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 30,289 మందికి రూ.13,34,74,500

తణుకు నియోజకవర్గంలో 34,716 మందికి రూ.15,14,75,000

ఉండి నియోజకవర్గంలో 34,116 మందికి రూ.14,74,95

గణపవరం మండలంలో 8,383 మందికి రూ.3,73,64,000 పింఛన్లు నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు..



## తెలంగాణపై విషం చిమ్మిన చౌహాన్

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓ రకంగా విషం కక్కారు. ఇటీవల కేంద్ర మంత్రులు అడపాదడపా విషం కక్కుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి మన రాష్ట్రానికే చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు పెద్దగా పట్టింపు లేదు. ఏదైనా పని కావాలని పట్టుబట్టి చేయించడం లేదు. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖళ మంత్రుల సమావేశంలో శివరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. అంతేగాకుండా ఆంధ్రా మత్రాం భేషుగ్గా పనిచేస్తోందని స్తుతించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో మోడీ సర్కార్ నడుస్తోంది. అందుకే ఈ మధ్య బాబును పొగడం కేంద్రమంత్రులు బాగా అలవాటు చేసుకున్నారు. పనులు గట్టెక్కించుకునే క్రమంలో చంద్రబాబు కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. కానీ మధ్యలో తెలంగాణలో తెగడాల్సిన పనిలేదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. పనిలో పనిగా గ్రామీణాభి వృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐ నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు.

# ‘అయోధ్య’ అవినీతికి జవాబుదారీ ఎవరు?

బాబ్రీ మసీదు కట్టడాన్ని కూల్చివేసిన రోజు (డిసెంబర్ 6, 1992) ముందు రాత్రి అయోధ్యలో సీనియర్ ఆర్ఎస్ఎస్ సభ్యుడు, జర్నలిస్టు, రామజన్మభూమి ఉద్యమం సమయంలో మీడియా వ్యవహారాలను పర్యవేక్షించిన రమా శంకర్ అగ్నిహోత్రిని కలుసుకున్నాను. ఆయన పక్కనే ఉన్న ఫైజాబాద్ (అయోధ్య) ఎంపీ వినయ్ కతియార్ నాకు కరసేవ గురించి సమాచారం ఇచ్చారు. భజరంగ్‌దళ్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా ఆయన రామ జన్మభూమి ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన వారిలో ఒకరు. అశోక్ సింఘాల్, వినయ్ కతియార్, కల్యాణ్ సింగ్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువు మహంత్ వైద్యనాథ్, ఉమాభారతి, సాధ్వి రితంభర వంటి నేతలు లేకపోతే రామజన్మభూమి ఉద్యమమే లేదు. రామ్ రథయాత్ర పేరిట ప్రజల్లోకి వెళ్లిన ఆడ్వాణీ ఈ ఉద్యమానికి రాజకీయ రూపమే కాని, అసలు ఉద్యమం నిర్వహించిన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ వంటి శక్తులు వేరు. అయోధ్య నుంచి మూడుసార్లు గెలిచిన వినయ్ కతియార్ ‘మందిర్ వహీ బనాయేంగే’ వంటి నినాదాలతో ప్రాచుర్యం పొందారు.అలాంటి వినయ్ కతియార్ ఇవాళ అయోధ్యలో జరుగుతున్న పరిణామాలను తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఆలయంలో ఉన్న హుండీల నుంచి భారీ ఎత్తున నగదు, ఆభరణాలను దోచుకోవడంపై ఆయన తీవ్ర మనస్తాపం ప్రకటించారు. ‘ప్రస్తుతం ఉన్నవారందరూ దొంగలే’ అని ఆయన అన్నారంటేనే పరిస్థితి తీవ్రత మనకు అర్థమవుతుంది. వినయ్ కతియార్ మాత్రమే కాదు, అనేకమంది సాధువులు కూడా ఈ దోపిడీని ఖండించారు. ‘నిధులు దోచుకున్నవారు రావణులు’ అని భాగేశ్వర్‌ధామ్ అధినేత ధీరేంద్ర కృష్ణశాస్త్రి అన్నారు. స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి, ప్రవచనకర్త దేవకీనందన్ ఠాకూర్, మహంత్ కమల్‌నయన్ దాస్ వంటి సాధువులు ఎందరో ఈ దోపిడీ వెనుక శక్తిమంతులు ఉన్నారని ఆరోపించారు. ‘ఈ విషయంలో నేను నిజం చెపితే సమస్యల్లో పడతాను’ అని బీజేపీ మాజీ ఎంపీ ఒకరు అన్నారు. ఆలయ నిర్మాణం, ఆస్తుల నిర్వహణ, ప్రజల విరాళాలను నిర్వహించేందుకు 2020లో కేంద్ర ప్రభుత్వం శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఏర్పాటు చేసినప్పటి నుంచే ఈ నిధులను కొల్లగొడుతున్నారని, భక్తులు సమర్పించిన బంగారం, వెండి, నగలపై ఎవరూ సరిగా లెక్కలు రాయలేదని ట్రస్టు మాజీ సీఈఓ మహిపాల్‌సింగ్ ఆరోపించారు. ఓచర్లకూ, నగదు, నగలకు మధ్య పొంతన లేదని ఆయన ఎత్తి చూపిన తర్వాత దర్యాప్తు చేసేందుకు బదులు ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. 2026 జూన్ 7న ఈ విషయం సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ ప్రస్తావించి, న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేసిన తర్వాతే అయోధ్య విరాళాల బాగోతం బయటకు పొక్కింది. బ్యాంకు ఖాతాలు, ట్రస్టు ఖాతాలను ప్రజలకు చూపించి పారదర్శకంగా వెల్లడించాలని బీజేపీ నేత రజనీష్‌సింగ్ నేరుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఎట్టకేలకు జూన్ 13న ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను నియమించింది.అయోధ్యలో రామజన్మభూమి కోసం భక్తులు ఎంత పెద్ద సంఖ్యలో విరాళాలు, ఆభరణాలు, బంగారం, వెండి ఇటుకలు సమర్పించారో లెక్క తెలియదు. అక్షింతల పంపిణీ పేరిట, ‘రామ్ రామ్ గ్రామ్ అభియాన్’ పేరిట నిర్వహించిన కార్యక్రమాలకు అనేకమంది భక్తులు తాదాత్మ్యంతో ప్రతిస్పందించారు. సీసీటీవీ కెమెరాల్లో కనీసం 70సార్లు నగదు తీసుకువెళుతున్నట్లు, మూటలు మోసుకెళుతున్నట్లు దృశ్యాలు బహిర్గతమయ్యాయి. సిబ్బంది కొందరు కావాలనే కెమెరాలకు అడ్డుగా నిలుచుని హుండీల నుంచి నగదు కాజేసే దృశ్యాలు రికార్డు కాకుండా చేశారని సిట్ తేల్చింది. దోచుకున్న డబ్బుతో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారన్న సమాచారం కూడా లభించింది. సిట్ అరెస్టు చేసిన వారిలో నోట్లు లెక్కపెట్టే కొందరు అధికారులు, ట్రస్టు ప్రధాన కార్యదర్శి, వీహెచ్‌పీ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు చంపత్‌రాయ్ బన్సల్, ఆయన వ్యక్తిగత డ్రైవర్ రమాశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్ తదితరులు ఉన్నారు. కానీ బాధ్యత వహించాల్సిన చంపత్ రాయ్ బన్సల్, ట్రస్టీ అనిల్ మిశ్రాలు కేవలం రాజీనామాలు చేశారు. అనిల్ మిశ్రా అయోధ్యలో అధునాతన సౌకర్యాలతో మూడంతస్తుల బ్రహ్మాండమైన బంగళాను నిర్మించుకున్నారని వార్తలు వచ్చాయి. నిజానికి అయోధ్యలో కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ వ్యవహారాలు నడిపిన అలోక్ బన్సల్, ఆయన సతీమణి శివానీ బన్సల్, చందన్ రాయ్ బన్సల్, మనీష్ బన్సల్ తదితరులు చంపత్ రాయ్ బంధువర్గీయులే, సిట్ స్వాధీనం చేసుకున్న అనేక భూమి కొనుగోళ్ల పత్రాలు మీడియాకు చేరాయి. మహారాష్ట్రకు చెందిన కర్ణాటక ప్రాంత ప్రచారక్, వీహెచ్‌పీ కేంద్ర జాయింట్ సెక్రటరీ గోపాల్‌రావును పరిపాలనా అధికారిగా నియమించింది. చంపత్ రాయ్ తర్వాత అత్యంత శక్తిమంతుడైన గోపాల్‌రావు అయోధ్యలో అనేక ఉడుపి హోటల్స్ సృష్టికర్త అని కూడా సమాచారం. రామమందిర ఉద్యమం అనేదే లేకపోతే భారతీయ జనతా పార్టీయే లేదు అన్నది పూర్తిగా సత్యదూరం కాదు. బీజేపీ ఉత్థానంలో రామజన్మభూమి పాత్ర ఉన్నదన్న విషయం లాల్‌కృష్ణ ఆడ్వాణీయే తన జీవిత చరిత్రలో వివరించారు. రామజన్మభూమి ఉద్యమాన్ని స్వతంత్ర భారత చరిత్రలో అతి పెద్ద ప్రజా ఉద్యమంగా ఆయన అభివర్ణించారు. సోమనాథ్ నుంచి ఆయన రథయాత్ర జరిపిన తర్వాతే 1991 ఎన్నికల్లో బీజేపీకి 120 సీట్లు లభించాయి. 1998లో బీజేపీ ఎన్నికల ప్రణాళికలో రామమందిరం గురించి వాగ్దానం చేసింది. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలో బీజేపీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడింది. మతం పట్ల ప్రజలకు ఉన్న మమేకతను సానుకూల దిశలో మళ్లించినట్లయితే ఒక అద్భుతమైన శక్తిగా తీర్చిదిద్దగలమని నిరూపించామని, ఒక దేశ ఆత్మ వ్యక్తీకరణతో ప్రజల సామూహిక వ్యక్తీకరణ కలిసికట్టుగా ప్రతిధ్వనించిందని ఆయన ప్రకటించారు. తన ఉద్యమం ద్వారా నిద్రాణంగా ఉన్న హిందూత్వను మేలుకొల్పాలని భావించిన ఆడ్వాణీ రాముడిని భారత జాతీయ వ్యక్తిత్వానికి, సమైక్యతకు, సమగ్రతకు విశిష్టమైన సంకేతంగా అభివర్ణించారు. ఈ ఉద్యమం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ రామజన్మభూమి కోసం చేసిన ఎన్నో త్యాగాలు పరమార్థం కోల్పోయినట్లు కనిపిస్తోంది. కొన్ని దశాబ్దాలుగా రామాయణం ఈ దేశంలో సమున్నత నైతిక విలువల వ్యవస్థను ప్రభావితం చేసిందని ఆడ్వాణీ లాంటి వారు భావించారు. మతానికీ, మత వ్యవస్థకూ రామాయణం అతీతమైనదని ఆర్ష విజ్ఞాన ట్రస్టును నెలకొల్పిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి పమిడిఘంటం కోదండరామయ్య రాశారు. ‘రామో విగ్రహవాన్ ధర్మః’ అన్నట్లుగా రాముడు రూపుదాల్చిన ధర్మం కనుకనే భారతదేశంలో రామాయణం కలకాలం నిలిచిందని ఆయన తన ‘రామాయణ ప్రభ’ గ్రంథంలో పేర్కొన్నారు. శ్రీరాముడి సత్యసంధత గురించి వాల్మీకి రామాయణంలో అడుగడుగునా ప్రస్తావించారని, ఆ సత్యవాక్పరిపాలనే యుగయుగాలుగా భారతీయ సమాజాన్ని ప్రభావితం చేసిందని ఇలపావులూరి పాండురంగారావు వంటి పండితులు చెప్పారు. రాముడిని మూర్తీభవించిన ధర్మదేవతగా మారీచుడితో వాల్మీకి చెప్పించారు. రాముడు సత్యపరాక్రముడని, సత్య ధర్మ పరాయణుడని, సత్యసంధుడని, సత్యశీలుడని, సత్యమే ఆత్మగా కలవాడని వాల్మీకి ప్రశంసించారు. ‘సత్యమొక్కటే దైవం, లోకంలో భక్తికి ఆధారభూతం సత్యమే. అన్నిటికీ మూలమున్నది సత్యంలోనే. సత్యానికి మించి ఉన్నత లక్ష్యం లేనే లేదు’ అని వాల్మీకి చెప్పారు. ‘ధర్మం పుట్టేది బలం లోంచి. (బలో ప్రతిష్ఠో ధర్మః ధరణ్యామివ జంగమం.) ‘ధర్మమూ, బలమూ సత్యానికి తోడయితే ఏ మహా విపత్తు నుంచైనా కాపాడగలుగుతాయి’ అని ఆయన సూత్రీకరించారు. సత్యం ద్వారా సమస్త లోకాన్ని జయించవచ్చునని అన్నారు. ‘నాకు ధన కనక వస్తువాహనాలపై మోహం లేదు నాకు కావల్సింది రాజ్యం కాదు (నా హమర్థ పరో దేవి లోకమావస్తు ముత్సహే)’ అని రాముడితోనే వాల్మీకి చెప్పిస్తారు. కాని ఇప్పుడు జరుగుతున్నదేమిటి? రామాయణం అంటే రాముడు నడిచిన దారి అని అర్థం. ఆ దారిలో మనం నడుస్తున్నామా? ఇవాళ బలవంతులు సత్యానికీ, ధర్మానికీ అండగా ఉన్నారా? అధికారం కంటే దేశమే ముఖ్యమని భావిస్తున్నారా? రామమందిరం నిర్మించి రాముడి విగ్రహం ప్రతిష్ఠాపిస్తే సరిపోతుందా? దేశంలో అంతటా సత్యం, ధర్మం అనే వాటికి ఏ మాత్రం విలువ లేదని, స్వప్రయోజనాలు, ధనార్జన, అధికార ఆకాంక్ష, దౌర్జన్య పాలనే ధ్యేయంగా మారిందని జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. ‘అధికారం అవినీతికి దారితీస్తుంది. సంపూర్ణ అధికారం సంపూర్ణ అవినీతికి దారితీస్తుంది’ అన్న సూక్తిని ఇతర పార్టీలతో పాటు బీజేపీ నేతలు కూడా నిరూపిస్తున్నారు. సంఘ్ పరివార్‌లో సైతం కొందరు అవినీతికి అతీతులు కాదని తేలింది. ఇవాళ బీజేపీలోనూ, సంఘ్‌లోను నానాజీ దేశ్‌ముఖ్, కుశాభావు ఠాక్రే, జేపీ మాథుర్, బైరాన్ సింగ్ షెఖావత్, లక్ష్మణరావు ఇనామ్‌దార్ వంటి నీతిమంతుల కోసం అన్వేషించాల్సి వస్తోంది. ఆలయం నిర్వహణను సంఘ్ నుంచి ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకునేందుకో లేక యోగి ఆదిత్యనాథ్‌ను ఇరకాటంలో పెట్టేందుకో అయోధ్య విరాళాల దోపిడీని రచ్చ కెక్కించారన్న ప్రచారం కూడా జరుగుతోంది. దేశ రాజకీయాల్లో బీజేపీ పట్టు పూర్తిగా బిగుస్తుందనుకున్న సమయంలో ఆ పార్టీ పురోగతికి కారణమైన అయోధ్యలో దోపిడీ జరగడం ఒక దుష్పరిణామం. ఈ పరిణామం ప్రజల్లో కలవరం సృష్టిస్తోంది. ఇవాళ అయోధ్యలో న్యాయవాదులు కూడా దోపిడీదారుల తరఫున వాదించేందుకు నిరాకరిస్తున్నారు. ఇది ఒక రాజకీయ పార్టీపైనో, ఆర్ఎస్ఎస్ లాంటి హిందూ ధర్మానికి కట్టుబడ్డామని చెప్పుకుంటున్న సంస్థపైనో వచ్చిన కళంకం కాదు. దేశంలో శ్రీరాముడిని, రామాయణాన్ని ఆరాధించే ప్రజల మనసులపై ఏర్పడ్డ గాయం. ఏ రాముడి బాణం బీజేపీ ఉత్థానానికి కారణమయిందో అదే బాణం బీజేపీ పతనానికి కారణం కాకుండా చూసుకోవల్సిన బాధ్యత ఆ పార్టీ నేతలపై ఉన్నది.

# దూర విద్య ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అవకాశం

## మధ్యలో చదువు మానివేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 30 నంది పత్రిక** మధ్యలో విద్యను నిలిపివేసిన విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, వివిధ వృత్తులు నిర్వహిస్తున్న వారు తమ విద్యను తిరిగి కొనసాగించేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 202627 విద్యా సంవత్సర ప్రవేశాలకు సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు జూన్ 12 నుంచి జూలై 30,2026 వరకు నిర్ణీత ఫీజుతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అలాగే ఆగస్టు 2 నుంచి ఆగస్టు 15,2026 వరకు రూ.200 అపరాధ రుసుముతో ప్రవేశాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యలో చదువును నిలిపివేసిన విద్యార్థులు, వివిధ కారణాల వల్ల సాధారణ విద్యను కొనసాగించలేకపోయిన మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు తమ విద్యను తిరిగి కొనసాగించేందుకు ఇది ఒక సువర్ణావకాశమని కలెక్టర్ అన్నారు. దూర విద్యా విధానం ద్వారా చదువును కొనసాగించడం వల్ల ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య అవకాశాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యకు దూరం కాకుండా జీవితాంతం నేర్చుకునే దిశగా ముందుకు సాగాలని ఆమె సూచించారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని గుర్తింపు పొందిన అక్రిడిటెడ్ ఇన్‌స్టిట్యూషన్ కేంద్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా చదువు మధ్యలో నిలిపివేసిన విద్యార్థులను గుర్తించి, వారిలో అవగాహన కల్పించి, 202627 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, వివిధ వృత్తి, వ్యాపార రంగాలకు చెందిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా అధికారులు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ పి.వి సత్యనారాయణ రాజు ఉన్నారు.

# మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ ?

ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమికి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి.

# సంక్షేమం ఆర్థిక భారం కాదు, అభివృద్ధికి బాట!

ప్రభుత్వరంగ సంస్థల గురించి ఒక అపోహ దశాబ్దాలుగా ప్రచారంలో ఉంది. ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తే ఆ సంస్థలు దివాళా తీస్తాయని, ప్రజలకు రాయితీలు ఇస్తే ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతింటుందని, అవి ఎప్పటికీ లాభాల్లోకి రావని కొందరు నమ్మించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) సాధించిన చారిత్రాత్మక విజయం ఈ అపోహలన్నింటినీ ఒక్కసారిగా చెదరగొట్టింది. దాదాపు పదేళ్ల పాటు నష్టాలతో పోరాడిన టీజీఎస్ఆర్టీసీ, 202526 ఆర్థిక సంవత్సరంలో రూ.1,059 కోట్లకు పైగా మిగులు నమోదు చేయడం కేవలం ఒక ఆర్థిక గణాంకం కాదు. ఇది తెలంగాణ ప్రభుత్వ పాలనాతత్వానికి, దూరదృష్టికి, ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధితో ముడిపెట్టిన ఆలోచనకు దక్కిన ఘన విజయం. దీనిని అర్థం చేసుకోవాలంటే ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఒకప్పుడు నష్టాల ఊబిలో కూరుకుపోయిన సంస్థ, రెండేళ్ల వ్యవధిలోనే వరుసగా మిగులు ఎలా సాధించింది? ప్రభుత్వం టీజీఎస్ ఆర్టీసీని కేవలం ఒక వ్యాపార సంస్థగా చూడలేదు. ప్రజల జీవితాలను ముందుకు నడిపే సామాజిక బాధ్యత కలిగిన ప్రజాసేవా సంస్థగా చూసింది. అదే ఆలోచన ఈ మార్పునకు పునాది అయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పుడు విమర్శలు వెల్లువెత్తాయి. ‘ఆర్టీసీ పూర్తిగా కుప్పకూలుతుంది’, ‘ఉచిత పథకాలతో సంస్థ దివాళా తీస్తుంది’, ‘ప్రభుత్వం ప్రజాదరణ కోసం ఆర్థిక వ్యవస్థను పణంగా పెడుతోంది’ అంటూ అనేక విమర్శలు వచ్చాయి. మహాలక్ష్మి పథకం వల్ల లక్షలాది మహిళలు మరింత ఎక్కువగా బస్సులను వినియోగించడం ప్రారంభించారు. గ్రామీణ మహిళలు, విద్యార్థినులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగినులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రతిరోజూ ధైర్యంగా ప్రయాణిస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల సంఖ్య బస్సుల ఆక్యుపెన్సీని సుమారు 67శాతం నుంచి 98శాతానికి తీసుకెళ్లింది. ఒకప్పుడు ఖాళీగా తిరిగిన అనేక సర్వీసులు నేడు పూర్తిస్థాయిలో నడుస్తున్నాయి. అంటే ప్రభుత్వం ప్రజల కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయి తిరిగి ఆర్థిక కార్యకలాపాలను పెంచింది. ఇది సంక్షేమం కాదు అని ఎవరైనా చెప్పగలరా? ఇది ఖర్చు కాదు... పెట్టుబడి. మహాలక్ష్మి పథకానికి ప్రభుత్వం ఆర్టీసీకి సకాలంలో రీయింబర్స్‌మెంట్ అందించింది. ఈ నిర్ణయం వల్ల సంస్థలో నగదు ప్రవాహం మెరుగుపడింది. ఒకవైపు మహిళలకు ఉచిత ప్రయాణం, మరోవైపు సంస్థకు ఆర్థిక భద్రత. ఇదే తెలంగాణ మోడల్ ప్రత్యేకత. దేశంలో అనేక రాష్ట్రాల్లో సంక్షేమం, ఆర్థిక క్రమశిక్షణ మధ్య సంఘర్షణ కనిపిస్తుంటే, తెలంగాణ మాత్రం రెండింటినీ సమన్వయం చేసి చూపించింది. ఈ విజయాన్ని కేవలం మహాలక్ష్మి పథకానికే పరిమితం చేయడం సరైంది కాదు. టీజీఎస్ఆర్టీసీలో ఒకేసారి అనేక సంస్కరణలు అమలయ్యాయి. వ్యయ నియంత్రణ, డిజిటల్ టికెటింగ్ విస్తరణ, అద్దె బస్సుల సమర్థ వినియోగం, మార్గాల శాస్త్రీయ పునర్వ్యవస్థీకరణ, టోల్, సేఫ్టీ సెస్ రౌండ్-ఆఫ్ వంటి ఆదాయ వనరుల పెంపు, ఇంధన వినియోగంలో క్రమశిక్షణ, ప్రతి డిపోలో పనితీరు సమీక్ష ఇవి అన్నీ కలిసి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేశాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో సంస్కరణలు అంటే ఉద్యోగులను తగ్గించడం కాదని, నిర్వహణను మెరుగుపరచడమే నిజమైన సంస్కరణ అని తెలంగాణ నిరూపించింది. ఏ ప్రభుత్వ విధానం అయినా దాన్ని విజయవంతం చేసేది ఉద్యోగులే. క్లిష్టపరిస్థితుల్లోనూ సంస్థను నిలబెట్టిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, అధికారులు, కార్మిక సంఘాలు ఈ విజయానికి అసలైన భాగస్వాములు. ప్రజలకు చిరునవ్వుతో సేవలందించిన వారి కృషి లేకపోతే ఈ ఫలితం సాధ్యమయ్యేది కాదు. వారి శ్రమకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ గౌరవం ఇస్తుంది. ఒక సంస్థకు ప్రభుత్వం మూలధనం ఇవ్వగలదు. కానీ ప్రజల విశ్వాసాన్ని కొనివ్వలేదు. టీజీఎస్ఆర్టీసీపై తెలంగాణ ప్రజలు చూపించిన నమ్మకం ఈ విజయానికి మరొక కారణం. ప్రైవేట్ వాహనాల కంటే ప్రజా రవాణాను ఎంచుకోవడం ద్వారా ప్రజలు పర్యావరణ పరిరక్షణకు, ఇంధన పొదుపునకు, రోడ్డు భద్రతకు కూడా తోడ్పడ్డారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం ఒకే లక్ష్యంతో సాగుతోంది. అది ప్రజల జీవితాలను మెరుగుపరచడం. విద్య, వైద్యం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, ఉపాధి, మౌలిక సదుపాయాలు... ఇలా ప్రతి రంగంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. టీజీఎస్ఆర్టీసీ విజయం కూడా అదే దృక్పథానికి ప్రతిబింబం.ఈ విజయం అంతిమ గమ్యం కాదు. ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణ, గ్రీన్ మొబిలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫ్లీట్ మేనేజ్‌మెంట్, ఆధునిక బస్ స్టేషన్లు, మహిళల భద్రత, డిజిటల్ సేవలు, ఉద్యోగుల సంక్షేమం ఇవన్నీ రాబోయే సంవత్సరాల్లో టీజీఎస్ఆర్టీసీ అభివృద్ధి ప్రాధాన్యతలు. దేశానికి ఆదర్శంగా నిలిచే ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఒకప్పుడు నష్టాల వార్తలతో నిలిచిన టీజీఎస్ఆర్టీసీ, నేడు విజయగాథగా మారింది. సంక్షేమం సక్రమమైన ఆర్థిక నిర్వహణతో కలిస్తే ప్రభుత్వరంగ సంస్థలు బలహీనపడవు... మరింత బలపడతాయి. ప్రజల విశ్వాసం, ఉద్యోగుల అంకితభావం, ప్రభుత్వ దూరదృష్టి ఒకే దిశగా సాగితే అసాధ్యం అనుకున్న లక్ష్యాలూ సుసాధ్యం అవుతాయి. టీజీఎస్ఆర్టీసీ చరిత్రలో నమోదైన ఈ మిగులు కేవలం ఆర్థిక లాభం కాదు. ఇది తెలంగాణ అభివృద్ధి తత్వానికి, సమర్థ పాలనకు, ప్రజలతో కలిసి నడిచే ప్రభుత్వానికి చిరస్థాయి గుర్తింపు.





## వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతాం



రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని శిల్పకళా వేదిక నుండి రైతు భరోసా లో భాగంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమానికి హాజరై, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకాటి శ్రీహరి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని రైతు వేదికల ద్వారా జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఇట్టి కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయగా, చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులను ఒక్కొక్కటిగా సరి చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ లో భాగంగా 25 లక్షల 35 వేల మంది రైతులకు 20 వేల 677 ఓట్ల రూపాయలు రుణమాఫీ చేయడం జరిగిందని, రైతు భరోసాలో భాగంగా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు 27 వేల కోట్ల రూపాయల రైతు భరోసా రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ప్రస్తుతం 9 వేల కోట్ల రూపాయలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మొత్తంగా 36 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కొరకు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగానికి 30 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, 4 వేల కోట్ల రూపాయల బోనస్, 2 వేల కోట్ల రూపాయలతో పనిముట్లు, రైతు భీమా పథకం కొరకు 3 వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా రైతుల వద్ద నుండి 2 లక్షల 88 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 80 వేల కోట్ల రూపాయలు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేశామని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 1 లక్ష 75 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగం కోసం ఖర్చు చేయడం జరిగిందని, సరాసరి ప్రతి నెల 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. నష్టాలలో ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను 1 వేయి కోట్ల లాభాలలోకి తీసుకురావడం జరిగిందని, సింగరేణి, విద్యుత్, ఆర్థిక, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయడం జరిగిందని, రెవెన్యూ శాఖలో భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సంక్షేమంలో భాగంగా మహాలక్ష్మి పథకంలో రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఇప్పటివరకు 11 వేల కోట్ల రూపాయలు ఆర్ టి సి సంస్థకు చెల్లించామని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ, పెట్రోల్ బంకులు నడిపించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, హైదరాబాద్ లోని ఐ.టి. సంస్థల మధ్య 1 వేయి కోట్ల రూపాయల భూమిని ఇందిరా మహిళ భవన్ కు కేటాయించి స్వయం సహాయక సంఘాల ద్వారా 150 షాపులు ఏర్పాటు చేసి నిర్వహణకు అవకాశం కల్పించడం జరిగిందని, రాష్ట్రంలో దాదాపు 8 వేల స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఒకేసారి సమావేశం నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కేంద్రాలలో ఇందిరా మహిళా శక్తి భవనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా గ్రూప్ 1 నిర్వహించి 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగిందని, గ్రూప్ 2 లో 1 వేయి 100 మంది, అన్ని ప్రభుత్వ శాఖలలో దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి కాలానుగుణంగా దిగుబడి వచ్చే పంట సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా ప్రభుత్వమని, ప్రతి రంగానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నాగులవంచ రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అరుణాచల్‌లో చైనా చొరబాట్లు మీడియా కథనాలను తోసిపుచ్చిన ఆర్మీ

చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది. ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

## ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంతో పాటు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత ఆర్ సీఓ లతో హాస్టళ్ల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్,డార్మెటరీ, ఫర్నిచర్, వంటశాల, డైనింగ్ హాల్, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భవనాల స్థితిని పరిశీలించి, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహాలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి లోపాలను వెంటనే గుర్తించి, నివేదిక సమర్పించాలని, తదనుగుణంగా ఆయా సంక్షేమ అధికారులు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థకు జీరో విద్యుత్ బిల్లు వచ్చేలా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కిచెన్, టాయిలెట్ వ్యర్థాలు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ఇంకుడుగుంతల నిర్మాణాలు చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో పాఠశాలల పరిస్థితులను మెరుగ్గా తీర్చిదిద్దినట్లు, వసతిగృహాల మరమ్మతులకు నిధుల మంజూరికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రతి సంక్షేమ శాఖ లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అధ్వాన్న స్థితిలో ఉన్న వసతి గృహాన్ని ఎంపికచేసి, పూర్తి స్థాయిలో తీర్చిదిద్దే విధంగా చర్యలకు నిధుల గురించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వర్షాకాలం కావున అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డోర్లు, కిటికీలు వైర్ మెష్ ఏర్పాట్లు, టాయిలెట్లమరమ్మత్తులు, నీటి నిల్వ లేకుండా చర్యలు వెంటనే చేయాలన్నారు. ఆహారం విషయంలో జిల్లాలో ఎక్కడ ఫుడ్ పాయిజన్ సమస్య ఉత్పన్నం కావడానికి వీలులేదని, ఎక్కడైనా సంఘటన జరిగితే కఠినచర్యలు వుంటాయని కలెక్టర్ అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు దగ్గరలోని వసతి గృహాలను మ్యాపింగ్ చేయాలన్నారు. వసతి గృహల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తరువాత గ్రీవెన్స్ లలో అడ్మిషన్లు, బదిలీల కొరకు వచ్చిన దరఖాస్తులకు మిగులు సీట్లలో అవకాశం కల్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా బిసి, సాంఘీక సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, ఆయా శాఖల ఆర్ సీఓ లు, విద్యుత్ శాఖ ఏవో కె. శ్రీధర్,



# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు..

జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు ప్రయత్నించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిఘా సంస్థలు గుర్తించిన సమాచారం ప్రకారం.. జమ్మూకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మొద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నారు.

## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్

భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ (ట్యాంక్ రెజిమెంట్) విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో (2అసఖుఅఎవతీం) కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్ట్రన్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ప్లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

## పాల్వంచలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై ఉక్కుపాదం మోపాలి

**-అధిక ఫీజులు,బలవంతపు కొనుగోళ్లతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం**
**-నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి**
**-డీఈఓకు ఫిర్యాదు చేసిన బీజేపీ నేత పొనిశెట్టి వెంకటేశ్వర్లు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నాయని బీజేపీ నాయకుడు పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలు, అధిక ఫీజుల వసూళ్లు, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కి మంగళవారం ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాల్వంచలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ మార్గదర్శకాలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అడ్మిషన్ ఫీజు,ట్యూషన్ ఫీజు,వార్షిక ఫీజు పేర్లతో వేలాది రూపాయలు వసూలు చేయడంతో పాటు యూనిఫార్మ్‌లు, పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్, బ్యాగులు,షూస్,సాక్స్ తదితర వస్తువులను పాఠశాలల్లోనే లేదా యాజమాన్యం సూచించిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని విమర్శించారు.నర్సరీ, ఎల్‌కేజీ,యూకేజీ వంటి చిన్నారులకు కూడా అవసరానికి మించిన పుస్తకాలు,నోట్‌బుక్స్ పేరుతో రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి అమాయక తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. అనేక ప్రైవేట్ పాఠశాలల్లో పార్కింగ్ సౌకర్యం, ఆటస్థలాలు,స్వచ్ఛమైన తాగునీటి వసతి,అగ్నిమాపక భద్రత,భవన భద్రత వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని ఆరోపించారు. అయినప్పటికీ భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.కొన్ని మైనారిటీ విద్యాసంస్థలు ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన స్థలాల్లో వాణిజ్య భవనాలు నిర్మించి అద్దెలకు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారి పిల్లలపై వివక్ష చూపుతున్నారని,దీంతో చాలామంది తల్లిదండ్రులు భయంతో ముందుకు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్య అనేది వ్యాపారం కాదని, సమాజ నిర్మాణానికి పునాదని పేర్కొన్నారు.పాల్వంచలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఫీజుల నియంత్రణ,మౌలిక వసతులు,భద్రతా ప్రమాణాల అమలుపై సమగ్ర పరిశీలన చేపట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే ఆయా పాఠశాలల గుర్తింపును కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి పాల్వంచలో జరుగుతున్న విద్యా దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దున్నపోతుల రాజు,భూక్యా మోహన్,మాలోత్ ప్రశాంత్, భట్టు అశోక్,గొళ్ల శ్రీమాన్ నారాయణ,కనకాల క్రాంతి, సంకినేని రుద్,అజ్మీరా హాథిరామ్,కొత్తపల్లి విజయ్, బియ్యని విజయ్ తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com